14న డీఎంకే యువజన విభాగం

మహానాడు

తిరువణ్ణామలైలో ఏర్పాట్లు ● వరాలు ప్రకటించనున్న స్టాలిన్



చెన్నై, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ నెల 14న డీఎంకే యువజన విభాగం మహానాడు తిరువణ్ణామలైలో జరుగనుంది. ఈ మహానాడుకు సంబంధించి మంత్రి ఈవీ వేలు నేతృత్వంలో ఏర్పాట్లు సాగుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి 200 సీట్లలో గెలిచి తీరాలని పార్టీ అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ టార్గెట్ ప్రకటించడంతో పార్టీ శ్రేణులు ఆ దిశగా రాష్ట్రమంతటా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అదే సమయంలో తిరువణ్ణామలైలో జరుగనున్న డీఎంకే యువజన విభాగం మహానాడును విజయం చేసేలా పార్టీ శ్రేణులంతా ఆ నగరానికి చేరుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందస్తు ప్రచార కార్యక్రమంగా డీఎంకే యువజన విభాగం మహానాడును అట్టహాసంగా జరపాలని డీఎంకే నేతలు భావిస్తున్నారు. ఈ మహానాడులో డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రజలకు కొన్ని వరాలను ప్రకటించనున్నారని, ముఖ్యంగా పొంగల్ నగదు కానుక, మహిళలకు అమలు చేస్తున్న వెలుగుబాట పథకాన్ని వృద్ధులకు కూడా విస్తరింపజేయటంపైఆయన అధికారింగా ప్రకటించనున్నారి తెలుస్తోంది. వీటిలో రేషన్‌షాపుల ద్వారా సంక్రాంతికి ఇచ్చే కిరాణా సరకులతో పాటు రూ.5వేల నగదు కూడా అందజేయనున్నారని ఇప్పటికే ఊహాగానాలు చెలరేగుతున్నాయి. ఈ నేపథ్యంలో తిరువణ్ణామలైలో జరిగే యువజన విభాగం మహానాడును ప్రతిష్ఠాత్మకంగా భావించి పార్టీ నిర్వాహకులు ముమ్మర ఏర్పాట్లు చేపడుతున్నారు.

సోనియాకి స్టాలిన్ జన్మదిన శుభాకాంక్షలు

పెరంబూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సోనియా గాంధీకి ముఖ్యమంత్రి స్టాలిన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ మంగళవారం తన 79వ జన్మదినం జరుపుకున్నారు. ఆమెకు కాంగ్రెస్ నేతలు, పలు పార్టీల నేతలు సామాజిక మాధ్యమాల్లో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా సోనియా గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సీఎం తన ఎక్స్ పేజీలో.. 'కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు. ఆమె త్యాగం, నిస్వార్థ ప్రజా ప్రయాణం, లౌకికవాదం, రాజ్యాంగ విలువలు కాపాడటానికి దృఢమైన నిబద్ధతకు ఆమె జీవితం నిదర్శనం., ఆమె సూత్రప్రాయ మార్గం, మార్గదర్శకం దేశం కోసం మన సమష్టి ప్రయత్నాలను బలోపేతం చేస్తాయి' అంటూ సీఎం స్టాలిన్ ట్వీట్ చేశారు.

బహిరంగ సభకు హాజరైన ప్రజానీకం (ఇన్‌సెట్లో) ప్రజలకు విజయ్ అభివాదం





వారి మాటలు నమ్మి

మోసపోకండి

పుదువై సభలో డీఎంకేపై విజయ్ విసుర్లు

పుదుచ్చేరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎట్టి పరిస్థితుల్లోనూ డీఎంకేని నమ్మవద్దని, ఆ పార్టీ నేతలంతా నమ్మించి మోసగిస్తారని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధినేత విజయ్ పుదుచ్చేరి ప్రజలకు పిలుపునిచ్చారు. ఉప్పళంరేవు మైదానంలో మంగళవారం ఉదయం జరిగిన బహిరంగ సభలో ప్రచార వాహనంపై నిలిచి ఆయన ప్రసంగించారు. కరూర్ దుర్ఘటన తర్వాత ఆయన బహిరంగ సభలో పాల్గొనటం ఇదే మొదటిసారి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్రప్రభుత్వం తమిళనాడును ఒక రాష్ట్రంగా, పుదుచ్చేరిని కేంద్రపాలిత ప్రాంతంగా పక్షపాత ధోరణి అవలంభిస్తోందని, అయితే ఈ రెండు ప్రాంతాల్లో నివసిస్తున్న వారంతా తమిళులే అన్న ఏకభావంతోనే తాము వ్యవహరిస్తామని, తమిళులు ప్రపంచంలో ఏ మూల నివసించినా వారంతా తమ ఆత్మీయ బంధువులేనన్నారు. పుదుచ్చేరి అంటేనే మనక్కుళ వినాయకుడు, అరవిందాశ్రమం, విల్లియనూరు మాత గుర్తుకు వస్తారన్నారు. అంతేగాక తమిళ మహాకవి బస చేసిన పుణ్యభూమి ఇదేనని, పావేందర్ భారతి దాసన్ జన్మించిన భూమి కూడా ఇదేనని తెలిపారు. అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీఆర్ 1977లో తమిళనాట అధికారంలోకి వచ్చారని, అయితే అంతకంటే ముందుగానే 1974లో పుదుచ్చేరిలో అన్నాడీఎంకేప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. అప్పట్లోనే తమిళులను కాపాడేందుకు వచ్చిన మహానాయకుడు ఎంజీఆర్ అని, ఆయన్ని వదలొద్దంటూ తమిళనాడు ప్రజలను పుదుచ్చేరి వాసులు అప్రమత్తం చేసిన విషయాన్ని ఎవరూ మరువలేరని విజయ్ పేర్కొన్నారు. అంతటి కీర్తిని సంతరించుకున్న పుదుచ్చేరిని మరువగలమా? ఇక్కడున్న ప్రజలు కూడా తమిళనాడులోని ప్రజల్లాగే తనను మూడు దశబ్దాలకు పైగా సినిమా నటుడిగా ఆదరిస్తున్నారని, ప్రస్తుతం రాజకీయల్లోకి వచ్చిన తనను ఉన్నత స్థితికి తీసుకెళ్తారనే నమ్మకం ఉందన్నారు. పుదుచ్చేరి ప్రజలకు ఏ సమస్య ఎదురైనా అందరికంటే తానే ముందుండి పరిష్కరిస్తానని విజయ్ ప్రకటించారు.

పుదుచ్చేరి సర్కార్‌ను చూసి నేర్చుకోండి...

ఈ సభ ఇంత ప్రశాంతంగా భారీ స్థాయిలో జరగటానికి పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్ఆర్ రంగసామి ప్రభుత్వమే కారణమని, అందుకు సీఎంకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని విజయ్ చెప్పారు. పుదుచ్చేరి ప్రభుత్వం డీఎంకే ప్రభుత్వంలా కక్షసాధింపు చర్యలకు పాల్పడలేదని, వేరే పార్టీకి చెందిన బహిరంగ సభ అయినా పక్షపాత ధోరణి ప్రదర్శించకుండా ఈ సభకు వచ్చిన లక్షలాదిమంది ప్రజలకు పటిష్టమైన భద్రత కల్పించిందని ప్రశంసించారు. పుదుచ్చేరిలో సంకీర్ణ ప్రభుత్వమే అధికారంలో ఉన్నప్పటికీ కేంద్రప్రభుత్వం ఇక్కడ అభివృద్ధిని పట్టించుకోలేదనే విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. రాష్ట్ర హోదా కల్పించాలని యేళ్లతరబడి శాసనసభలో తీర్మానాలు చేసి ఆమోదించి పంపినా కేంద్రం సానుకూలత ప్రకటించలేదని ఆరోపించారు. పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో మూతపడిన ఐదు మిల్లులను, పలు కర్మాగారాలను తెరిచేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గానీ, రాష్ట్రంలోని సంకీర్ణ ప్రభుత్వం గానీ ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. దేశంలోనే రేషన్ షాపులు లేని ప్రాంతం పుదుచ్చేరి లో ప్రజలకు నిత్యావసర సరకులు లభించేలా చర్యలు చేపట్టాలన్నారు. పుదుచ్చేరిలోని కారైక్కాల్, మాహే, యానాం ప్రాంతాల్లో ఇంకా ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. పుదుచ్చేరి - కడలూరు మధ్య రైలు మార్గం నిర్మించాలన్న ప్రతిపాదన యేళ్ల తరబడి పెండింగ్‌లో ఉందని, సుమారు 20లక్షల మంది నివసిస్తున్న యూనియన్ ప్రాంతమైన పుదుచ్చేరి కేంద్ర ఆర్థిక కమిటీలో సభ్యత్వం కల్పించకపోవడం శోచనీయమన్నారు. వచ్చే శాసన సభ ఎన్నికల్లో పుదుచ్చేరిలో టీవీకే గెలిచి అధికారంలోకి రావటం ఖాయమని విజయ్ స్పష్టం చేశారు. విజయ్ ఈ సభకు నిర్దేశిత సమయం కంటే ముందే సభా ప్రాంగణానికి చేరుకోవడం విశేషం. అక్కడున్న ప్రచార వాహనంలో గంటపాటు గడిపారు. ఆ తర్వాత నిర్ణీత సమయంలో ఆ వాహనం పైకొచ్చి ప్రసంగించారు. పుదుచ్చేరి పోలీసులు ఆ ప్రచార వాహనం చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. విజయ్ ప్రసంగించిన ప్రచార వాహనానికి జనానికి మధ్య సుమారు రెండు వందల అడుగుల దూరం వరకూ ఖాళీగా ఉంచారు. విజయ్ ఈ సభలో 11 నిమిషాలపాటు ప్రసంగించారు.

రంగసామి, విజయ్ ఫొటోలతో ప్లకార్డుల ప్రదర్శన

ఈ సభకు హాజరైన కార్యకర్తలందరూ పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి, విజయ్ ఫొటోలున్న ప్లకార్డులను పట్టుకుని సందడి చేశారు. విజయ్ తన ప్రసంగంలో సీఎం రంగసామికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఇదే సమయంలో విజయ్ ప్రసంగాన్ని సీఎం రంగస్వామి తన నివాసంలో కూర్చుని మొబైల్ ఫోన్‌లో చివరి వరకు చూడడం విశేషం. ఇదిలా వుండగా ఈ సభలోనూ విజయ్ ఎప్పటిలానే బీజేపీ, అన్నాడీఎంకే పార్టీలపై ఎలాంటి విమర్శలు చేయకపోవడం గమనార్హం.

నేడు అన్నాడీఎంకే

సర్వసభ్య సమావేశం

వానగరంలో భారీ ఏర్పాట్లు ● కీలక ప్రకటనలకు అవకాశం



ఏర్పాట్ల పరిశీలనలో అన్నాడీఎంకే నేతలు

చెన్నై, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికలకు ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే సన్నద్ధమవుతోంది. ఇప్పటికే ఆపార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి రాష్ట్ర వ్యాప్త పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం పార్టీ సర్వసభ్యమండలి సమావేశం వానగరంలోని శ్రీవారు వేంకటాచలపతి ప్యాలెస్‌లో జరుగనుంది. ఈ సమావేశానికి రాష్ట్రం నలుమూలలనుండి కార్యనిర్వాహక మండలి, సర్వసభ్య మండలి సభ్యులైన సుమారు 2 వేలమంది రానున్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా మాజీ మంత్రులు, జిల్లా శాఖ కార్యదర్శులు సహా మరో 2 వేల మంది హాజరవుతున్నారు. ఈ సమావేశానికి సంబంధించి మాజీ మంత్రి, తిరువళ్లూరు జిల్లా సెంట్రల్ శాఖ అధ్యక్షుడు బెంజమిన్ నేతృత్వంలో భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. మంగళవారం ఉదయం అన్నాడీఎంకే మాజీ మంత్రులు కేపీ మునుసామి, ఎస్పీ వేలుమణి, డాక్టర్ సి.విజయభాస్కర్ ఏర్పాట్లను పరిశీలించారు. సుమారు ఐదు వేల మందికి ఆహార పదార్థాలను తయారు చేయడానికి ఏర్పాటైన భారీ వంటశాలలను కూడా పరిశీలించారు. సమావేశ ప్రాంగణంలో సీటింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా బెంజమిన్ మాట్లాడుతూ సర్వసభ్యమండలి సమావేశానికి వచ్చే ఎడప్పాడి పళనిస్వామికి కోయంబేడు ఫ్లైఓవర్ నుంచి కార్యకర్తలు ఘన స్వాగతం పలుకుతారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు కూడా చేయనున్నారని తెలిపారు.

అక్కడ 41 మందిని

బలిగొన్నారు

- ఇక్కడా అవే వేషాలా?
- టీవీకే ఆనంద్‌ను నిలదీసిన ఎస్పీ ఈషా సింగ్



పుదుచ్చేరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): "అక్కడ 41 మందిని పొట్టనబెట్టుకున్నారు. ఇక్కడా అవే వేషాలా?.. అనుమతి మేరకునడుచుకోండి. సభకు భద్రత కల్పించడమెలాగో నాకు తెలుసు. మీలాంటి వారి సలహాలు నాకు అక్కర్లేదు. జాగ్రత్తగా మసలు కోండి" అంటూ టీవీకే నేత బుస్సీ ఆనంద్‌ను పుదుచ్చేరి ఎస్పీ ఈషా సింగ్ హెచ్చరించారు. ఎవరి మెప్పు కోసమో ఇష్టానుసారంగా జనాలను తరలిస్తానంటే కుదరదని తేల్చి చెప్పారు. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అనేకమంది ఆమె ధైర్యాన్ని మెచ్చుకుంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. పుదుచ్చేరిలో టీవీకే బహిరంగ సభ కోసం నిబంధనలతో అనుమతిచ్చిన విషయం తెలిసిందే. ఈ సభకు 5 వేల మందికి మాత్రమే అనుమతి ఇచ్చారు. ఆ మేరకు ఆహ్వానితులకు పాస్‌లు కూడా పంపిణీ చేశారు. పాస్‌లున్నవారిని మాత్రమే అనుమతించాలని పోలీసులకు సూచనలు వెళ్లాయి. అయితే సభా ప్రాంగణం వద్దకు వచ్చిన బుస్సీ ఆనంద్.. పాసుల్లేని వారిని కూడా లోనికి పంపించాలని పోలీసులపై ఒత్తిడి చేశారు. గమనించిన ఎస్పీ ఈషా సింగ్ అతడిని గట్టిగా మందలించారు. పాసులున్నవారిని మాత్రమే అనుమతిస్తామని ఆమె తేల్చిచెప్పారు. రద్దీలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకూడదని ముందస్తు ఏర్పాట్లు చేశామని, పార్టీ అధినేత మెప్పు పొందేందుకు పాసులు లేని వారిని అనుమతించాలని డిమాండ్ చేయడం సరికాదన్నారు. కరూర్‌లో జరిగిన రోడ్‌షోలో 41 మంది ప్రాణాలు కోల్పోవడానికి మీ నిర్లక్ష్యమే కారణమంటూ బుస్సీని నిలదీశారు. వీరి మధ్య సాగిన మాటల వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలైంది. దీనిని చూసిన వారంతా ఈషా సింగ్ ధైర్యాన్ని మెచ్చుకుంటూ ఆమె రాజకీయ నాయకులకు సింహ స్వప్నమని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు.

సిద్ధ వైద్యానికి

గవర్నర్ వ్యతిరేకం

● మంత్రి సుబ్రమణ్యం

ప్యారీస్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తమిళుల సంప్రదాయ సిద్ధవైద్యాన్ని గవర్నర్ ఆర్‌ఎన్ రవి వ్యతిరేకించడం సరికాదని ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యం పేర్కొన్నారు. తేనాంపేట డీఎంఎస్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో 405 మంది పార్ట్‌టైమ్ నర్సులు, 105 మంది సూపర్‌వైజర్లకు పదోన్నతి ఉత్తర్వులను మంత్రి సుబ్రమణ్యం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో సిద్ధ వైద్య విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని గవర్నర్ ఆర్‌ఎన్ రవి ఆలస్యంగా రాష్ట్రపతికి పంపించారని, ఆయనకు సిద్ధ వైద్యం అంటే ఎందుకు గిట్టలేదో అర్థం కాలేదన్నారు. సీఎం స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ నాలుగున్నరేళ్లలో ఆరోగ్యశాఖలో సరికొత్త రికార్డు నెలకొల్పేలా 35,702 కొత్త పోస్టులను సృష్టించిందని, మరో 17,750 పోస్టులను భర్తీ చేసిందన్నారు.జనవరిలో 1,479 మంది నర్సులకు ఉద్యోగ నియామక ఉత్తర్వులను సీఎం స్టాలిన్ పంపిణీ చేస్తారని మంత్రి తెలిపారు.



నియామక పత్రాలను అందజేస్తున్న మంత్రి సుబ్రమణ్యం

అన్నాడీఎంకేలో చేరిన సెంగోట్టయన్ అన్న కుమారుడు

పెరంబూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల టీవీకేలో చేరిన మాజీ మంత్రి కేఏ సెంగోట్టయన్ అన్న కుమారుడు సెల్వం, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఈరోడ్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి సెంగోట్టయన్ అన్న కేఏ కాళియప్పన్ అన్నాడీఎంకే ఎంపీగా, పలు పదవులు నిర్వహించారు. కేఏ కాళియప్పన్ కుమారుడు సెల్వం 2021లో డీఎంకేలో చేరి పర్యావరణ విభాగంలో జిల్లా ఆర్గనైజర్‌గా వ్యవహరిస్తున్నారు. సెల్వం పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారంటూ పార్టీ నుంచి తొలగించారు. ఈ క్రమంలో, సెల్వం మంగళవారం అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సమక్షంలో అన్నాడీఎంకేలో చేరారు.



ఈపీఎస్‌తో సెల్వం బృందం

17నుంచి ఢిల్లీలో సంప్రదాయ వైద్యంపై శిఖరాగ్ర సదస్సు

ప్యారీస్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని న్యూఢిల్లీలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు మూడు రోజుల పాటు సంప్రదాయ వైద్యంపై అంతర్జాతీయ సదస్సు జరుగుతుందని హోమియోపతిక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డిజేబిలిటీస్-చెన్నై రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్, కన్సల్టెంట్ డాక్టర్ కొల్లిరాజు పేర్కొన్నారు. శివానంద రోడ్డులోని దూరదర్శన్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎన్ఐఈపీఎండీ ల్యాబ్ టెక్నీషియన్ చిత్రా భాస్కరన్, పీఐబీ అధికారి ఎ.అళగుదురైతో కలిసి కొల్లిరాజు మాట్లాడారు. కేంద్రప్రభుత్వ ఆయుష్ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ సూచనల మేరకు న్యూఢిల్లీలో సంప్రదాయ వైద్యంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ మూడు రోజుల పాటు మానవాళి ఆరోగ్యం, ఆనందం, శ్రేయస్సు సంప్రదాయ వైద్యం తదితర అంశాలపై సుమారు వంద దేశాలకు చెందిన మంత్రులు, రూపకర్తలు, పరిశోధకులు, నిపుణులు, పరిశ్రమల ప్రతినిధులు, ప్రాక్టీషనర్లు పాల్గొనే 2వ అంతర్జాతీయ శిఖరాగ్ర సదస్సు నిర్వహిస్తున్నట్టు కొల్లిరాజు తెలిపారు. 19వ తేదీ ముగింపు సమావేశంలో ప్రధాని నరేంద్రమోదీ పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈస్ట్‌కోస్ట్ రోడ్డు ముట్టుకాడులోని ఎన్ఐఈపీఎండీ క్యాంపస్ ద్వారా నిర్వహిస్తున్న పరిశోధన పథకాలు, కార్యకలాపాల గురించి ఆయన మీడియాకు వివరించారు.

హోమియో శాస్త్రవేత్త డాక్టర్ కొల్లిరాజు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కొల్లిరాజు

ఓపీఎస్, దినకరన్‌తో భేటీ...!

● ఢిల్లీకి అన్నామలై

చెన్నై, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలై సోమవారం రాత్రి ఢిల్లీ వెళ్ళారు. కోయంబత్తూరులో మాజీ ముఖ్యమంత్రి ఒ. పన్నీర్‌సెల్వం (ఓపీఎస్), అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం అధ్యక్షుడు టీటీవీ దినకరన్ ఆయనతో భేటీ అయ్యారు. ఇటీవల ఓపీఎస్ ఢిల్లీ వెళ్ళి కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసి తిరిగొచ్చి, ఆదివారం కోయంబత్తూరులో జరిగిన ఓకార్యక్రమంలో పాల్గొని ఆ తరువాత అన్నామలైతో భేటీ అయ్యారు. ఆ సందర్భంగా ఇరువురూ రాష్ట్ర రాజకీయాలు గురించి చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి దినకరన్ కోయంబత్తూరులో అన్నామలై నివాసానికి వెళ్ళి కలుసుకున్నారు. ఆసందర్భంగా అన్నామలై విందు కూడా ఏర్పాటు చేశారు. అనంతరం అన్నామలై ఆకస్మింగా ఢిల్లీ వెళ్లారు. కోయంబత్తూరు ఎయిర్‌పోర్ట్‌లో మీడియాతో మాట్లాడుతూ ఓపీఎస్, దినకరన్ ఎన్డీయేలో ఉన్నారా?లేదా అన్నది ప్రధానాంశం కాదని, వారిద్దరు తనకు మంచి స్నేహితులని, అందుకే తనను కలుసుకున్నారని పేర్కొన్నారు. వీరిరువురినీ ఎన్డీయేలో చేర్చుకునేదిశగా బీజేపీ అధిష్టానంపై ఒత్తిడి చేసేందుకే అన్నామలై ఢిల్లీ వెళ్ళారని తెలుస్తోంది.

నా పేరు, ఫొటో వాడొద్దు

- తనయుడికి రాందాస్ ఆదేశం
- జీకే మణి వల్లే విడిపోయాం
- అన్బుమణి ఆరోపణ

ప్యారీస్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏ కార్యక్రమంలో తన ఫొటో గానీ, తన పేరు గానీ వినియోగించరాదని పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) వ్యవస్థాపకులు డాక్టర్ రాందాస్ తన కుమారుడు డాక్టర్ అన్బుమణిని హెచ్చరించారు. తండ్రీ కొడుకుల మధ్య నెలకొన్న విభేదాలతో ఆయన అన్బుమణిని పార్టీ నుంచి బహిష్కరించగా, పార్టీ ఎమ్మెల్యేలందరినీ తన వైపు తిప్పుకున్న అన్బుమణి పార్టీ తనదేనని ప్రకటించుకున్నారు. ఎన్నికల కమిషన్ కూడా 2026 వరకు అన్బుమణే పీఎంకే అధ్యక్షుడిగా వ్యవహరించవచ్చని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈసీ నిర్ణయాన్ని ఖండిస్తూ రాందాస్ వర్గీయులు ఢిల్లీలోని ఎన్నికల కమిషన్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడంతో పాటు కోర్టులో కూడా అన్బుమణికి వ్యతిరేకంగా కేసు వేశారు. ఈ నేపథ్యంలో, విల్లుపురం జిల్లా దిండివనంలోని తైలాపురం గార్డెన్‌లో రాందాస్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. పార్టీ ఉనికి కోసం యేళ్లతరబడి పోరాడుతున్న తనకు వ్యతిరేకంగా ఉత్తర్వులిచ్చిన ఈసీని కోర్టుకు లాగామని, త్వరలోనే తమకు అనుకూలంగా తీర్పువచ్చే అవకాశముందన్నారు. తనతో పాటు పని చేయడం ఇష్టంలేకుంటే అన్బుమణి పార్టీ నుండి వైదొలిగి సొంతంగా పార్టీ ప్రారంభిస్తే తండ్రిగా సంతోషిస్తానని, ఇకపై తనపేరు, ఫొటోను అన్బుమణి ఉపయోగించరాదని రాందాస్ హెచ్చరించారు.

ఇదిలా ఉండగా పీఎంకే మాజీ అధ్యక్షుడు జీకేమణి కుట్రవల్లే తన తండ్రి తనకు దూరమయ్యారని పార్టీ అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి ఆరోపించారు. చెంగల్పట్టు జిల్లా మహాబలిపురం పూంజేరి ప్రాంతంలో జరిగిన సమావేశంలో అన్బుమణి మీడియాతో మాట్లాడుతూ.. పీఎంకే అధ్యక్ష పదవి తనకు అప్పగించిన క్షణం నుండి జీకే మణి పార్టీని చీల్చేందుకు కుట్ర పన్నారని, ఆయన కోరుకున్నట్లే తండ్రీ కొడుకులిద్దరం విడిపోయామన్నారు. ఎన్నిఅడ్డంకులు ఎదురైనా పార్టీని ముందుకు తీసుకెళ్లాలన్నదే తమ లక్ష్యమని, పార్టీని తాను వదిలివెళ్లే ప్రసక్తేలేదని అన్బుమణి అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన ధర్నాలో 30 మంది పాల్గొంటే 3వేల మంది అని ప్రకటించుకున్నారని, పార్టీలో ఏం జరుగుతుందో కూడా 87 యేళ్ల తన తండ్రి రాందాస్ అర్థం చేసుకోలేకపోతున్నారన్నారు.



తనయుడు అన్బుమణితో రాందాస్

సమాచార దృష్టి

'చెన్నై వన్' యాప్‌లో 'బస్ పాస్' రాయితీ

పెరంబూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఇస్తున్న 50శాతం రాయితీ బస్‌పాస్ 'చెన్నైవన్'యాప్‌ద్వారా పొందే సదుపాయం కల్పించారు. నగరంలోమెట్రో, సబర్బన్, ఎంటీసీ బస్సులు, ఆటో,ట్యాక్సీల్లో ప్రయాణించేందుకు వీలుగా చెన్నై వన్ యాప్‌ను సెప్టెంబరు 22న పరిచయం చేశారు. ప్రయాణికుల నుంచి దీనికి సదుపాయానికి మంచి స్పందన లభిస్తోంది. ఈక్రమంలో, నగరశివారు ప్రాంతంలోని కళాశాలల్లోచదువుతున్న విద్యార్థులకు ప్రస్తుతం 50శాతం రాయితీతో బస్ పాస్ అందజేస్తున్నారు. ఇక నుంచి బస్ పాస్‌ను చెన్నై వన్ యాప్ నుంచి పొందవచ్చని రవాణా శాఖ అధికారులు తెలిపారు.

రేపటి నుంచి నంగనల్లూర్‌లో సంగీత ఉత్సవాలు

పెరంబూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భగవాన్ అన్నదానం ట్రస్ట్ ఆధ్వర్యంలో నంగనల్లూర్ రామ మందిరంలో సంగీతోత్సవాలు బుధవారం నుంచి 12 రోజులు జరుగనున్నాయి. మార్గళిమాసం సందర్భంగా భగవాన్ అన్నదానం ట్రస్ట్, ప్రతి ఏడాది సంగీత ఉత్సవాలు నిర్వహిస్తోంది. ఈ ఏడాది ఉత్సవాల్లో గాత్రం, హరికథ, భరతనాట్యం, భజన, మాండొలిన్ తదితర ప్రదర్శనలుంటాయి. ప్రముఖ కళాకారులు సిక్కల్ గురుచరణ్, విశాఖ హరిప్రియా సిస్టర్స్, మహతి, రాజేష్ వైద్య, సిద్ శ్రీరామ్ సహా పలువురి కళాకారుల ప్రదర్శనలు ప్రతిరోజు సాయంత్రం 4.30, 6.30 గంటలకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

'పీఎం యశస్వి' విద్యా ఉపకారవేతనం

పెరంబూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'పీఎం యశస్వి' విద్యా ఉపకారవేతనం దరఖాస్తు గడువు ఈ నెల 15వ తేది వరకు పొడిగించారు. పీఎం యశస్వి పథకంలో గుర్తింపు పొందిన పాఠశాలల్లో 9 నుంచి 11 తరగతి వరకు చదువుతున్న ఓబీసీ, ఈబీసీ, టీఎన్‌టీ విభాగాల విద్యార్థులకు ప్రతి ఏటా రూ.4 వేల ఉపకారవేతనం అందజేస్తున్నారు. ఈ సంవత్సరం పునరుద్ధరణ, కొత్త దరఖాస్తుల సమర్పణకు ఈ నెల 15వ తేది వరకు అవకాశం పొడిగించారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థుల వార్షికాదాయం రూ.2.5 లక్షల లోపు ఉండాలి. అర్హులైన విద్యార్థులు https://scholarships.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

15నుంచి పరిశ్రమల ఏర్పాటుపై శిక్షణ

పెరంబూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్, చెన్నై ఆధ్వర్యంలో 'మీరు కూడా వ్యాపారి కావచ్చు' అనే పేరుతో పరిశ్రమల ఏర్పాటుపై ఈ నెల 15 నుంచి 19వ తేది వరకు శిక్షణ ఇవ్వనున్నారు. పరిశ్రమ ఏర్పాటుకు ప్రాథమిక అంశాలు, మార్కెటింగ్, బ్రాండింగ్, ఇ-మార్కెటింగ్, ప్రాజెక్ట్ నివేదిక రూపకల్పన, ఆర్థిక నిర్వహణ, ప్రాథమిక ఖాతాలు, జీఎస్‌టీ, వ్యాపార సంబంధిత చట్టాలు తదితరాలపై వివరించనున్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి నిండిన యువతీ, యువకులు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. శిక్షణలో చేరే యువతీ యువకులకు తక్కువ అద్దెతో వేర్వేరు బస, వసతి కల్పించనున్నారు. ఈకాట్టుతాంగళ్ సిడ్కో ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంగణంలోని సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణా తరగతులు జరగనున్నాయి. ఆసక్తి ఉన్నవారు www.editn.in అనే వెబ్‌సైట్‌లో పేరు నమోదుచేసుకోవాలని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.

కొత్తగా ఆరు బస్టాండ్ల నిర్మాణాలకు టెండర్లు

పెరంబూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరం, శివారుప్రాంతాల్లో ఆరు బస్టాండ్ల నిర్మాణాలకు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) టెండర్లు విడుదలచేసింది. ఎంటీసీ700లకుపైగా మార్గాల్లో ప్రతి రోజు 3,488బస్సులు నడుపుతోంది. నగరజనాభా పెరుగుతున్న నేపథ్యంలో 2030 సంవత్సరానికి సుమారు 7వేలబస్సులు నడపాల్సిన ఉంటుందని ఎంటీసీ లెక్కించింది. ఆ ప్రకారం, అదనపు బస్సులు నడిపేలా తరమణి, తిరువళ్లూర్, తైయూర్, మామండూర్, వరదరాజపురం, ఆట్టన్‌తాంగళ్ తదితర ఆరు ప్రాంతాల్లో కొత్త బస్టాండ్ల నిర్మాణాలకు ఎంటీసీ టెండర్లు ఆహ్వానించింది. అలాగే, పల్లవన్ హౌస్‌లో విద్యుత్ బస్సులకు ప్రత్యేక డిపో, ఆలందూర్, ఆవడి, అయ్యప్పన్ తాంగళ్, పాడియనల్లూర్, పెరంబూర్ తదితర ప్రాంతాల్లో ప్రస్తుతమున్న డీజిల్ డిపోల ప్రాంగణాల్లో విద్యుత్ బస్సులు నిలిపేలా ప్రత్యేక డిపోలు ఏర్పాటు చేయనున్నట్లు ఎంటీసీ తెలిపింది.

రామేశ్వరంలో చేపల వేట నిషేధం

అడయార్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో బలమైన గాలులు వీస్తుండడంతో, రామేశ్వరం జాలర్లు బుధవారం చేపల వేటకు వెళ్లకుండా నిషేధం విధించారు. ఈ మేరకు మత్స్యశాఖ విడుదల చేసిన ప్రకటనలో... సముద్రంలో బలమైన గాలులతో పడవలు బోల్తాపడే ప్రమాదముందని, ఈ కారణంగా, రామేశ్వరం జాలర్లు చేపల వేటకు వెళ్లరాదని సూచించింది. అలాగే, తమ పడవలను తీరంలో భద్రంగా ఉంచుకోవాలని మత్స్యశాఖ సూచించింది.

హెచ్ఎంలకు విద్యాశాఖ సూచనలు

అడయార్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వీధిశునకాల దాడులు అధికమవుతున్న నేపథ్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ సర్క్యులర్ జారీచేసింది. అందులో, పాఠశాలలో నిర్వహించే పాఠశాల నిర్వహణ మండలి సమావేశంలో, పెంపుడు శునకాలకు టీకాలు తప్పనిసరి విద్యార్థులు, తల్లిదండ్రులకు తెలియజేసేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే, వీధిశునకాల బారిన పడకుండా విద్యార్థుల కోసం పాఠశాల ప్రాంగణంలో అవగాహన బోర్డులు ఏర్పాటుచేయాలని విద్యాశాఖ సూచించింది.

ఎన్నికల్లో పోటీకి ఆశావహుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం: టీఎన్‌సీసీ

అడయార్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీచేయాలనుకునే ఆశావాహులు దరఖాస్తులు సమర్పించవచ్చు. ఈ మేరకు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై విడుదల చేసిన ప్రకటనలో... శాసనసభ ఎన్నికల్లో పోటీచేయాలనుకునే వారు ఈ నెల 10 నుంచి 15వ తేది వరకు దరఖాస్తు సమర్పించాలన్నారు. చెన్నైలోని టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం, జిల్లా పార్టీ కార్యాలయాల్లో దరఖాస్తులు పొందవచ్చన్నారు. తాము పోటీచేయాలనుకునే నియోజకవర్గం, వారి వివరాలు, పార్టీలో చేసిన సేవలు, ఇతర కార్యక్రమాల వివరాలు కూడా దరఖాస్తుతో పాటు సమర్పించాలని సెల్వ పెరుందగై ప్రకటనలో తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలపై జాగ్రుతి



రోడ్డు భద్రతా అవగాహన ర్యాలీలో ట్రాఫిక్ అధికారులు, విద్యార్థులు

ప్యారీస్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వాహనాదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రత్యేకించి బైక్ నడిపేవారు హెల్మెట్ ధరించాలని గ్రేటర్ చెన్నై విల్లివాక్కం ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ మురుగరాజ్ పిలుపునిచ్చారు. విల్లివాక్కంలో ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక జాగృతి కార్యక్రమాన్ని నిర్వహించారు. హెల్మెట్ ధరించడం వల్ల అనుకోకుండా ప్రమాదాలు జరిగితే ప్రాణనష్టాన్ని నివారించ గలుగుతామని మురుగరాజ్ సూచించారు. శ్రీ కనక దుర్గ తెలుగు మహోన్నత పాఠశాల (ఎస్‌కేడీటీ) ప్రాంగణం నుంచి ప్రారంభమైన అవగాహన ర్యాలీలో ఎస్‌కేడీటీ చైర్మన్ ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి మాట్లాడుతూ, చిన్న నిర్లక్ష్యం ప్రాణాన్ని తీసే అవకాశముందన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలను పాటించాలని ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరి పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సీఎం కిషోర్, హెచ్ఎం కె.శారా సుహాసిని, ఏహెచ్ఎం అళగర్ రాజ్, ట్రాఫిక్ ఎస్ఐలు శక్తివేల్, బాలామణి, మురళి, కృష్ణమూర్తి, విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్లకార్డులతో ఊరేగింపులో పాల్గొని అవగాహన కల్పించారు.

జయలలిత వర్ధంతి సందర్భంగా అన్నదానం

తిరుత్తణి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత 9వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆర్కేపేట అన్నాడీఎంకే శ్రేణుల ఆధ్వర్యంలో ఆమెకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్కేపేట పట్టణాభివృద్ధి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన జయలలిత చిత్రపటానికి అన్నాడీఎంకే ఢిల్లీ మాజీ ప్రతినిధి పీఎం.నరసింహన్ పార్టీ శ్రేణులతో కలిసి నివాళులర్పించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, నిర్వాహకులతో కలిసి పేదలకు సంక్షేమ సహాయాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వేలూరు జిల్లా మాజీ కార్యదర్శి వాసు, తిరువళ్లూరు జిల్లా నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

దుబాయ్ విమానంలో సాంకేతికలోపం

పెరంబూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి దుబాయ్ బయల్దేరిన విమానంలో సాంకేతికలోపం తలెత్తింది. నగరం నుంచి మంగళవారం వేకువజామున 3.50 గంటలకు ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ విమానం దుబాయ్ బయల్దేరింది. బోయింగ్ రకానికి చెందిన ఈ పెద్ద విమానంలో 284 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బంది ఉన్నారు. విమానం టేకాఫ్ అయ్యే సమయంలో సాంకేతికలోపాన్ని పైలెట్ గమనించాడు. అతను వెంటనే విమానాన్ని నిలిపివేసి, కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాడు. అనంతరం ఉద్యోగులు అక్కడకు చేరుకుని విమానాన్ని దూరంగా తరలించిన అనంతరం, విమానం తలుపులు తెరచిన ఇంజనీర్లు లోనికి వెళ్లి మరమ్మతులు చేపట్టారు. కానీ, వారి ప్రయత్నాలు ఫలించకపోవడంతో, విమానం రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రయాణికులను విమానం నుంచి దింపి బస్సుల్లో నగరంలోని వివిధ హోటళ్లకు తరలించారు. మరమ్మతులు సరిచేసి బుధవారం వేకువజామున 1.30 గంటలకు విమానం బయల్దేరుతుందని అధికారులు ప్రకటించారు. పైలెట్ సకాలంలో విమానంలో సాంకేతికలోపం గుర్తించడంతో పెనుప్రమాదం తప్పింది.

ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించిన కలెక్టర్


కళాశాలలో పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ, కౌంటింగ్ నిర్వహించే వేలూరు తంథై పెరియార్ ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను మంగళవారం ఉదయం కలెక్టర్ సుబ్బులక్ష్మి పరిశీలించారు. కాగా, ఎన్నికల కౌంటింగ్, ఈవీఎంల భద్రత, ఎలక్షన్ అధికారుల పనితీరు తదితర అంశాలపై ఆమె అధికారులతో చర్చించారు. ఎస్పీ మయిల్ వాహనన్, జిల్లా ఆర్డీవో శివసుబ్రమణ్యంసహా పలుశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం...: రాష్ట్రంలో గుర్తింపు పొందిన డీఎంకే, అన్నాడీఎంకే, కాంగ్రెస్ తదితర పార్టీల ప్రతినిధులతో మంగళవారం ఉదయం వేలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు వినియోగించే ఈవీఎంల మొదటి విడత పనితీరు గురువారం పరిశీలించనున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా రాజకీయ ప్రతినిధులు పాల్గొని ఏవైనా సమస్యలు, అనుమానాలుంటే తెలియజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

బ్రాహ్మణ సంఘాల అభివృద్ధే లక్ష్యంగా...


సమావేశంలో బ్రాహ్మణ సంఘ నిర్వాహకులు

వేలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం సమిక్షా సమావేశం జరిగింది. అధ్యక్షుడు రాజా నేతృత్వంలో జరిగిన ఈ సమావేశం వేదమంత్రోచ్చారణతో ప్రారంభమైంది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమిళనాడులో బ్రాహ్మణుల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని, 18యేళ్లు నిండిన యువకులను కమిటీలో సభ్యులుగా చేర్చుకోవాలని, నిర్వాహకులు సమష్టిగా కృషిచేసి కమిటీని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. మండల ఆర్గనైజర్ కృష్ణమూర్తి, కార్యదర్శి పురుషోత్తమ్, కోశాధికారి రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 245 వినతులు


సమస్యలు తెలుసుకుంటున్న ఏసీపీ విజయేంద్ర

అడయార్, డిసెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): స్థానిక వెప్పేరి లోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో మంగళవారం పోలీస్ గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ మేరకు నగర పోలీసు శాఖ విడుదల చేసిన ప్రకటనలో... నగర పోలీసు కమిషనర్‌గా అరుణ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత, పోలీసు అధికారులు, పోలీసుల కోసం ప్రతి మంగళవారం గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపింది. అందులో భాగంగా, మంగళవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో అడిషినల్ కమిషనర్ విజయేంద్ర పిడారి పాల్గొన్నారు. ఈ గ్రీవెన్స్‌లో ఇద్దరు అసిస్టెంట్ కమిషనర్లు, 14 మంది సీఐలు, 19 మంది ఎస్ఐలు, 208 మంది కానిస్టేబుళ్లు, ఇద్దరు కార్యాలయ సిబ్బంది వచ్చి బదిలీ, క్వార్టర్స్ కేటాయింపు, వేతనం సమస్యలు సహా పలు విషయాలపై వినతిపత్రాలు సమర్పించారు. అడిషినల్ కమిషర్ ఆ సమస్యలు పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించినట్లు నగర పోలీసు శాఖ ప్రకటనలో తెలిపింది.

గర్భం దాల్చిన టెన్త్ విద్యార్థిని !

పెరంబూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లాకు చెందిన 15 ఏళ్ల బాలిక గర్భం దాల్చడంపై పోలీసులు, విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఓ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న బాలికతో పిచ్చైస్వామి (52) అనే వ్యక్తి సన్నిహితంగా ఉండేవాడని తెలిసింది. వారివురూ ఏకాంతంగా కలిసి ఉన్న దృశ్యాలను 16 ఏళ్ల బాలుడు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి ఈ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విడుదల చేస్తానని బెదిరించి ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు సమాచారం. ఇటీవల బాలిక అస్వస్థతకు గురికావడంతో, తల్లిదండ్రులు ఆమెను ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా ఆమె గర్భంతో ఉన్నట్లు వైద్యులు తెలిపారు. దీంతో, దిగ్భ్రాంతి చెందిన తల్లిదండ్రులు, ఆమె నుంచి విషయం తెలుసుకుని ఆండిపట్టి మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో విచారణ చేపట్టిన పోలీసులు, పిచ్చైస్వామి, బాలుడిని పోక్సో చట్టం కింద అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

కార్మికుడి హత్య కేసులో యువకుడి అరెస్ట్

వేలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్మికుడిని హతమార్చిన కేసులో ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా.. వేలూరు జిల్లా సదుప్పేరి గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్ అదే ప్రాంతంలో భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో, సోమవారం ఉదయం స్కూటర్‌పై వెళ్తున్న ప్రేమ్‌కుమార్‌ను బైక్‌పై వస్తున్న కోటేశ్వరన్ కుమారుడు శక్తి (24) ఢీకొన్నాడు. దీంతో వారిమధ్య వాగ్వాదం జరిగింది. ఆగ్రహించిన శక్తి సాయంత్రం ప్రేమ్‌కుమార్ రోడ్డుపై నడిచివెళుతుండగా, కత్తితో వెంబడించి హతమమార్చాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి 24 గంటల్లోనే నిందితుడిని అరెస్ట్ చేశారు.

ఊయలగా కట్టిన చీర ఉరి తాడై..

ప్యారీస్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా శ్రీ పెరుంబదూర్ సమీపంలో చీరతో కట్టిన ఊయలలో దుకుంటున్న 12యేళ్ల బాలుడి గొంతుకు చీర చుట్టుకోవడంతో ఊపిరాడక మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. శ్రీపెరుంబదూర్ సమీపంలోని ఎరుంగాట్టుకోట పెరియార్‌వీధిలో బిహార్‌కు చెందిన వలస కార్మికుల కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరిలో భర్తను కోల్పోయిన దేవి తన 12యేళ్ల కుమారుడు అనిల్‌తో అద్దె ఇంట్లో నివసిస్తోంది. దేవి కూలీ పనికి వెళ్లిన సమయంలో చీరతో కట్టిన ఊయల్లో ఆడుతున్న అనిల్ గొంతుకు చీర గట్టిగా చుట్టుకోవడంతో ఊపిరాడక కేకలేస్తూ స్పృహ కోల్పోయాడు. ఇరుగుపొరుగు వారు అనిల్‌ను అక్కడున్న ప్రభుత్వాసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే అనిల్ మృతిచెందినట్లు నిర్ధారించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.

వ్యాన్ కింద పడి బాలుడి మృతి


కామేశ్వరన్ (ఫైల్‌ఫొటో)

తిరుత్తణి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఆడుకుంటున్న రెండేళ్ల చిన్నారి వ్యాన్ కింద పడి మృతిచెందిన సంఘటన తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడు సమీపంలోని నాపాలూరు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలిలా.. వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న గణేశన్ తన భార్య మణిమేఘల, పిల్లలు రవి (5), ముగిలన్ (3), కామేశ్వరన్ (2)లతో కలిసి నాపాలూరులో నివశిస్తున్నాడు. ఈ నేపథ్యంలో, గణేశన్ తన రెండేళ్ల కుమారుడైన కామేశ్వరన్‌ను బంధువుల ఇంటికి బైక్‌పై తీసుకెళుతుండగా, అటువైపుగా వచ్చిన ఓ స్కూల్ వ్యాను వారిని ఢీకొనడంతో గణేశన్‌కు గాయాలు కాగా, బాలుడు వ్యాన్ చక్రం కింద పడి మృతిచెందాడు. గమనించిన స్థానికులు వెంటనే గణేశన్‌ను, బాలుడిని ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ



తిరుత్తణి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని చిత్తూరు రోడ్డులో మంగళవారం సాయంత్రం అయ్యప్ప పడిపూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. అయ్యప్ప దీక్ష చేపట్టిన శివాజీ, రాధ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజలో సమీపంలోని అయ్యప్పభక్తులంతా పాల్గొన్నారు.

న్యాయవ్యవస్థలో వ్యక్తిగత అభిప్రాయాలు: వైగో

అడయార్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): న్యాయవ్యవస్థలో వ్యక్తిగత అభిప్రాయాలు రుద్దే యత్నం ఇటీవల అధికమైందని, ప్రజలు వాటిని అంగీకరించరని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో తెలిపారు. కళింగపట్టణం వెళ్లేందుకు మంగళవారం ఉదయం చెన్నై విమానాశ్రయానికి వచ్చిన ఆయన మీడియాతోమాట్లాడుతూ.. తిరుప్పరంకుండ్రం సమస్యను హిందుత్వవాదులు పథకం ప్రకారం నడిపిస్తున్నారన్నారు. కొండపై ఉన్న దీపస్తంభంలో దీపం వెలిగించడం ఆచారంకాదని,ఈసారి అదేప్రాంతంలో దీపం వెలిగించాలంటూ న్యాయమూర్తి స్వయంగా తీర్పు ఇవ్వడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ఆ ప్రాంతంలో హిందువులు, ముస్లింలు ఐక్యతగా ఉన్నారన్నారు. తిరుప్పరంకుండ్రం అంశంలోవారు ఎలాంటి అల్లరి భావాలకు చోటివ్వకుండా మదురై జిల్లాకు గర్వకారణంగా ఉందన్నారు. ఈ ప్రణాళిక బెడిసికొట్టడంతో, మాతరం జెండాను తీసుకొచ్చేందుకు యత్నిస్తున్నారన్నారు. రాష్ట్రప్రజలు పరిణతి చెందినవారని, మతోన్మాదశక్తులను వారు అంగీకరించరని వైగో స్పష్టం చేశారు.

తిరుప్పూర్‌లో అంగన్వాడీల రాస్తారోకో : 120 మంది అరెస్ట్

ప్యారీస్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రాయితీ కోసం తిరుప్పూర్‌లో రాస్తారోకో నిర్వహించిన 120 మందికి పైగా అంగన్వాడీ కార్మికులను పోలీసులు అరెస్ట్ చేశారు. తమిళనాడు అంగన్వాడీ కార్మికులు, సహాయక ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏడు డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో మంగళవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ క్రమంలో తిరుప్పూర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు బైఠాయించిన అంగన్వాడీ కార్మికులు తమ డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని నినాదాలు చేశారు. ఈ నిసరన వల్ల ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో, పోలీసులు ఆందోళన విరమించుకోవాలని పలు మార్లు కోరినా, వినిపించుకోలేదు. దీనితో ఆందోళనకారులను అందరిని అరెస్ట్ చేశారు.


అంగన్వాడీ ఉద్యోగులను అరెస్ట్ చేస్తున్న దృశ్యం

వేలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన కోరికలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం వేలూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట జిల్లా అంగన్వాడీ ఉద్యోగుల సంఘ నేతలు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ ఉద్యోగులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న అంగన్వాడీ ఉద్యోగులు

ఢిల్లీ విమానానికి బాంబు బెదిరింపు

పెరంబూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ నుంచి చెన్నై వచ్చిన విమానానికి బాంబు బెదిరింపు కలకలం రేపింది. ఢిల్లీ నుంచి మంగళవారం ఉదయం వంద మంది ప్రయాణికులతో ఇండిగో విమానం చెన్నై బయల్దేరింది. విమానం ఆకాశంలో ఉండగా, విమానంలో బాంబు ఉందని, అది కొద్ది సేపట్లో పేలుతుందని చెన్నై విమానాశ్రయానికి ఈ-మెయిల్ వచ్చింది. ఈ కారణంగా చెన్నై విమానాశ్రయంలో విమానాన్ని అత్యవసర ల్యాండింగ్ చేశారు. అప్పటికే సిద్ధంగా ఉన్న బాంబు స్క్వాడ్ విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించారు. ఈ వ్యవహారంలో, బాంబు బెదిరింపు వచ్చిన ఈ-మెయిల్ చిరునామా కోసం పోలీసులు విచారణ చేపట్టారు.

వండలూరు జూలో మగ సింహం మృతి

పెరంబూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక వండలూరు జూ పార్క్‌లో మగ సింహం మృతిచెందింది. ఈ పార్క్‌లో ఉన్న 'రాఘవ్' అనే మగ సింహం కొద్దిరోజుల క్రితం అస్వస్థతకు గురైంది. వైద్య బృందం సింహానికి చికిత్స అందించింది. చికిత్స ఫలించక ఆదివారం సాయంత్రం రాఘవ్ మృతిచెందింది. సింహం కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించిన వైద్యులు, సమీపంలో ఖననం చేశారు.

జోరందుకున్న పొంగల్ కుండల తయారీ



పెరంబూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పొంగల్ నేపథ్యంలో, మట్టి కుండల తయారీ జోరుగా సాగుతోంది. రెండు తరాల క్రితం వరకు, ప్రజల దైనందిక జీవితంలో మట్టి పాత్రలు ముఖ్య పాత్ర పోషించాయి. ఆధునిక యుగంలో మార్పుల కారణంగా, మట్టి పాత్రలను ప్రజలు మరచిపోయినా, పొంగల్ రోజున మట్టి కుండలో పొంగళ్లు పెట్టే సంప్రదాయం ఇంకా కొనసాగుతోంది. వచ్చే నెల పండుగ వస్తుండడంతో, భారీవర్షాల అనంతరం నాలుగు రోజులుగా పొడి వాతావరణం నెలకొనడంతో మట్టి కుండల పనులు జోరందుకున్నాయి. తిరువళ్లూర్ జిల్లా ఎలావూర్ సమీపం తిప్పన్‌పాళయం గ్రామంలో పొంగల్ కుండలు, పాత్రల తయారీ జోరుగా సాగుతోంది.

కారు ఢీకొని కానిస్టేబుల్ మృతి

- మందుబాబు అరెస్టు


కానిస్టేబుల్ మేఘనాథన్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక పల్లిక్కరణై సమీపం మడిపాక్కం వద్ద కారు ఢీకొనటంతో ట్రాఫిక్ కానిస్టేబుల్ మృతి చెందాడు. మంగళవారం వేకువజామున మేఘనాథన్ అనే కానిస్టేబుల్ వాహనాల తనిఖీ చేస్తుండంగా ఓ కారు వేగంగా వచ్చి ఆగకుండా వెళ్ళింది. వెంటనే మేఘనాథన్ తన బైకులో ఆ కారును వెంబడించారు. అదే సమయంలో బైకు వెనుకగా వచ్చిన కారు ఢీకొంది. దీంతో మేఘనాథన్ రోడ్డుపై దూరంగా పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సాయిరామ్ అనే వ్యక్తి తాగిన మైకంలో కారు నడిపి కానిస్టేబుల్ బైకును ఢీకొట్టాడని పోలీసుల విచారణలో వెల్లడైంది. వెంటనే సాయిరామ్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

తంజావూరు, కుంభకోణంలో న్యాయవాదుల నిరాహార దీక్ష


తంజావూరు వద్ద నిరాహార దీక్ష చేస్తున్న న్యాయవాదులు

చెన్నై, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తంజావూరు, కుంభకోణం ప్రాంతాలకు చెందిన న్యాయవాదులు మంగళవారం కోర్టు విధులు బహిష్కరించి నిరాహార దీక్షలో పాల్గొన్నారు. న్యాయస్థానాల్లో మౌలిక సదుపాయాలు కల్పించకుండానే కేసులను ఈ-ఫైలింగ్ చేయాలని సుప్రీం కోర్టు, హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు నవంబరు 1న అమలులోకి వచ్చాయి. ఆ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ, తమకు తగు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రమంతటా న్యాయవాదులు ఆందోళనలు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం తంజావూరు, కుంభకోణం ప్రాంతాల్లోని న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నిరాహార దీక్షను చేపట్టారు.

తిరుప్పరంకుండ్రం కేసులో 2014 తీర్పు అమలు చేయాలి

- మదురైలో న్యాయవాదుల ధర్నా



పెరంబూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుప్పరంకుండ్రం దీపం కేసులో 2014వ సంవత్సరంలో హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు అమలుచేయాలని కోరుతూ మదురైలో న్యాయవాదులు మంగళవారం ధర్నా చేపట్టారు. తిరుప్పరంకుండ్రం కొండ శిఖరంపై ఉన్న దీపస్తంభంపై దీపం వెలిగించాలని ఇటీవల హైకోర్టు మదురై బెంచ్ న్యాయమూర్తి ఇచ్చిన తీర్పుతో తిరుప్పరంకుండ్రంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ వ్యవహారంలో, తిరుప్పరంకుండ్రం దీపం వెలగించడంపై 2014లో హైకోర్టు మదురై బెంచ్‌లో ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం తీర్పును అమలుచేయాలని, ఈ విషయంలో సామాజిక సామరస్యాన్ని కాపాడే ప్రయత్నంలో మాట్లాడిన ఎంపీలు తిరుమాళవన్, ఎస్.వెంకటేశన్‌లను కించపరుస్తున్న వారిని అరెస్ట్ చేయాలని కోరుతూ మదురై జిల్లా, హైకోర్టు న్యాయమూదులు హైకోర్టు మదురై బెంచ్ ముందు ధర్నా చేపట్టారు. ఈ విషయమై న్యాయవాదులు మాట్లాడుతూ... తిరుప్పరంకుండ్రం వ్యవహారంలో గత 2014లో న్యాయమూర్తులు ఎంఎం సుందరేశ్, సతీష్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం వెలువరించిన తీర్పు అమలుచేయాలన్నారు. న్యాయమూర్తి జీఆర్ స్వామినాథన్‌కు మద్దతుగా బీజేపీకి చెందిన న్యాయవాదులు ప్రదర్శన నిర్వహించారన్నారు. కానీ, తాము ఏ న్యాయమూర్తికి వ్యతిరేకంగా ధర్నా చేపట్టలేదని, తీర్పును సక్రమంగా అమలుచేయాలని కోరుతున్నట్లు న్యాయవాదులు తెలిపారు.

అతివేగానికి ముగ్గురు బలి

నగరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర పరిధిలోని చిత్తూరు జిల్లా నగరి మండలంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... తిరుచానూరు సమాజం వీధికి చెందిన అమ్మవారి ఆలయ పోటు వర్కర్ శంకర్ సుబ్రహ్మణ్యం(50), ఆలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఎస్.సంతానం(38) మంచి స్నేహితులు. మంగళవారం వారిద్దరూ కారులో తిరుత్తణికి బయలుదేరారు. నగరి మండల పరిధిలోని వీకేఆర్ పురం- తడుకుపేట మధ్య చెన్నై నుంచి తిరుమల వస్తోన్న కారును వీరి కారు ఢీకొంది. దీంతో తిరుచానూరు నుంచి వెళుతోన్న వ్యాగనార్ కారు రోడ్డుకు అవతల ఉన్న లోతట్టు ప్రాంతంలో ఎగిరి పడిపోగా చెన్నై నుంచి వస్తోన్న కారు రోడ్డుపైనే ఆగిపోయింది ఈ ప్రమాదంలో చెన్నైలోని మేడంబాక్కంకు చెందిన అరుణ్‌కుమార్(40), తిరుచానూరుకు చెందిన సంతానం, శంకర సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే మృతి చెందారు. అరుణ్‌కుమార్ భార్య తమిళ సెల్వి(36), మేనల్లుడు మదన్(40), కుమారుడు యశ్వంత్(11) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని పోలీసులు నగరి ఏరియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం తాంబరం ఆస్పత్రికి తరలించారు.

నీలాంబరి పాత్ర కోసం ఐశ్వర్యను అనుకున్నాం : రజనీకాంత్



'పడైయప్పా' చిత్రంలో రమ్యకృష్ణ పోషించిన నీలాంబరి పాత్ర కోసం తొలుత బాలీవుడ్ నటి ఐశ్వర్యా రాయ్ బచ్చన్‌ను అనుకున్నామని ఆ చిత్ర హీరో సూపర్ స్టార్ రజనీకాంత్ చెప్పారు. ఆయన చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి 50 యేళ్ళు పూర్తకున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకుని 'పడైయప్పా' మూవీ ఈ నెల 12న రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రజనీకాంత్ మాట్లాడుతున్న వీడియోను నిర్మాతలు విడుదల చేశారు. 'నీలాంబరి పాత్ర కోసం మొదట ఐశ్వర్యను అనుకుని ఆమె కాల్షీట్ కోసం నాలుగు నెలలు వేచివున్నాం. అయితే, ఆ పాత్రకు ఆమె అంగీకరించ లేదు. ఆ తర్వాత శ్రీదేవి, మీనా, మాధూరి దీక్షిత్ ఇలా అనేక మంది హీరోయిన్ల పేర్లు పరిశీలించాం. చివరకు దర్శకుడు రవికుమార్ ఒక రోజు ఫోన్ చేసి రమ్యకృష్ణ పేరు ప్రతిపాదించగా నేను ఓకే చెప్పాను. సినిమా విడుదలైన తర్వాత ఘన విజయం సాధించింది. ఇందులోని నీలాంబరి పాత్ర.. నేను 96, 97లో జయలలితకు వ్యతిరేకంగా ఉండటంతో ఆమెను మనసులో పెట్టుకుని నీలాంబరి పాత్ర రాశారనే చర్చ మొదలైంది. దీంతో జయలలిత సినిమా చూడాలని కోరడంతో పోయెస్ గార్డెన్‌కు మూవీ రీల్స్ పంపించాం. ఆ సినిమా చూసిన ఆమె అభినందించారు' అని రజనీకాంత్ పేర్కొన్నారు.

అభిమానులు హుందాగా నడుచుకోవాలి

● అజిత్ కుమార్



అగ్ర హీరో, కార్ రేసర్ అజిత్ కుమార్ తన అభిమానులకు మరో విజ్ఞప్తి చేశారు. అభిమానులు తనకుగానీ, తన జట్టుకుగానీ చెడ్డ పేరు తీసుకురావొద్దని, ఫ్యాన్స్ ఎపుడూ అదుపులో ఉంటూ హుందాగా నడుచుకోవాలని కోరారు. ప్రస్తుతం మలేసియా కార్ రేసింగ్ పోటీల్లో అజిత్ సారథ్యంలోని బృందం పాల్గొంటోంది. ఈ నేపథ్యంలో అజిత్‌ను చూసేందుకు, ఫొటోలు దిగేందుకు మలేసియాలోని ఆయన అభిమానులు మైదానానికి వచ్చి, తమ అభిమాన నటుడికి మద్దతుగా నినాదాలు చేశారు. దీన్ని గమనించిన అజిత్... మీ ప్రవర్తనతో ఉన్న మంచిపేరు పోతుంది. పైగా, ఇతర రేసర్లకు ఇబ్బందిగా ఉంటుంది. అందువల్ల నినాదాలు చేయకుండా ప్రశాంతంగా ఉండాలని కోరుతున్నా' అని పేర్కొన్నారు.



'వా వాత్తియార్' పురట్చితలైవర్‌కు అంకితం

● దర్శకుడు నలన్ కుమారస్వామి

చిత్రజ్యోతి

కార్తి, కృతిశెట్టి జంటగా రూపొందిన 'వా వాత్తియార్' సినిమా దివంగత నటుడు, మాజీ ముఖ్యమంత్రి పురట్చితలైవర్ ఎంజీఆర్‌కు అంకితమని ఆ చిత్ర దర్శకుడు నలన్ కుమారస్వామి పేర్కొన్నారు. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ సోమవారం రాత్రి నగరంలో జరిగింది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు నలన్ కుమారస్వామి మాట్లాడుతూ, 'తొమ్మిదేళ్ళ తర్వాత సినిమా తీస్తూ బిల్డప్ ఇస్తున్నారంటూ కామెంట్స్ చేశారు. మీరు ఆ విధంగా కామెంట్స్ చేయడంలో తప్పులేదు. 'సూదు కవ్వుం' సినిమా తీసినపుడు నిర్మాత ఎస్ఆర్ ప్రభు, శివకుమార్ ఎంతో బాధపడ్డారు. ఇలాంటి టైటిల్‌తో సినిమా తీయొచ్చా అని ప్రశ్నించారు. అపుడు వారిద్దరికి ఒక మాట ఇచ్చాను. 'ధర్మానిదే గెలుపు'.. అనే విధంగా ఒక సినిమా తీస్తామని వారికి చెప్పాను. అలాంటి సినిమానే ఇది. కార్తి తన పాత్రలో ఇమిడిపోయారు. ప్రతి ఒక్కరికీ ఈ చిత్రం నచ్చుతుంది' అన్నారు. హీరోయిన్ కృతిశెట్టి మాట్లాడుతూ, 'ఈ చిత్రం ద్వారా కోలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం కానుండటం ఎంతో సంతోషంగా ఉంది. దర్శకుడు నలన్, నిర్మాత జ్ఞానవేల్ రాజా, హీరో కార్తిలకు ధన్యవాదాలు' తెలిపారు. హీరో కార్తి మాట్లాడుతూ, 'దర్శకుడు చెప్పినట్టుగా ఈ చిత్రం మంచి సినిమా అవుతుంది. నాకు ఒక పొలిటికల్ స్టోరీ చెబుతాడని భావించాను. కానీ, 'వా వాత్తియార్' స్టోరీ వినిపించారు. ఈ సినిమా చేసేందుకు వెనుకంజ వేసినా, ఆ తర్వాత ధైర్యం చేసి అంగీకరించాను. 70, 80లోని కమర్షియల్ చిత్రాలకు దీటుగా, అంకితభావంతో పనిచేశారు. ఈ సినిమాలోకి వెళ్ళిన తర్వాతే ఎంజీఆర్ నిజస్వరూపం తెలుసుకున్నాను. ఎలాంటి చెడు అలవాట్లు లేకుండా జీవించడంతో పాటు తన అభిమానులను సైతం ఆ విధంగానే ఉండేలా తీర్చిదిద్దారు. అలాంటి గొప్ప వ్యక్తి మన మధ్య లేకపోయినా ఆయన పేరు మాత్రం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది. అందుకే చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్‌కు ఆయన పేరు పెట్టడంతో ప్రతి రోజూ కనీసం 5 వేల సార్లు ఎంజీఆర్ పేరును స్మరిస్తున్నారని పేర్కొన్నారు. ఆ తర్వాత నటి శిల్పా, నటులు ఆనంద్‌రాజ్, సత్యరాజ్, సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ తదితరులు ప్రసంగించారు. స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా ఈ చిత్రాన్ని నిర్మించగా, ఈ నెల 12న విడుదలకానుంది.

రోజుకో వదంతి వ్యాపిస్తున్నారు

● మీనాక్షి చౌదరి

తన గురించి సోషల్ మీడియాలో రోజుకో పుకారు పుట్టిస్తున్నారని హీరోయిన్ మీనాక్షి చౌదరి వాపోతున్నారు. 'కొలై', 'సింగపూర్ సలూన్', 'ది గోట్' వంటి చిత్రాల్లో నటించిన తమిళ ప్రేక్షకులకు దగ్గరైన ఈ నటి సల్మాన్ దుల్కర్‌తో 'లక్కీ భాస్కర్' మూవీలో నటించారు. ఈ చిత్రం ఘన విజయం సాధించడంతో మీనాక్షి తమిళ, తెలుగు భాషల్లో బిజీ హీరోయిన్ అయిపోయారు. అదేసమయంలో ఆమెపై సోషల్ మీడియాలో రోజుకో పుకారు వస్తోంది. దీనిపై ఆమె తాజాగా స్పందిస్తూ, 'సోషల్ మీడియాలో నెటిజన్లు, యూట్యూబర్స్, వెబ్‌సైట్స్ నిర్వాహకులు సెన్సేషన్ న్యూస్ కోసం ఈ తరహా పుకార్లు పుట్టిస్తూ, నా పేరు డ్యామేజ్ చేస్తున్నారు. ఇలాంటి వారికి ఇంత కుమించిన పని మరొకటి లేదు. నాకు ఏ ఒక్క హీరోతో ఎలాంటి ప్రేమ, రిలేషన్ లేదు' అని ఆమె స్పష్టం చేశారు.



సీయూబీ నుంచి శాలరీ బేస్‌డ్ క్రెడిట్ కార్డ్ ఆవిష్కరణ

చెన్నై, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రముఖ జీతం ఆధారిత ఆర్థిక శ్రేయస్సు వేదిక అయిన 'శాలరీ సే' బ్యాంకింగ్ రంగంలో దూసుకుపోతున్న 'సిటీ యూనియన్ బ్యాంక్‌తో భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఇది జీతం తీసుకునే వారి కోసం, యూపీఐ సాంకేతికతపై రూపే కార్డ్ ద్వారా ఆధారితమైన దేశంలోనే మొట్టమొదటి క్రెడిట్ కార్డ్. నగదు రహిత ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించాలనే రిజర్వ్ బ్యాంక్ దార్శనికతకు అనుగుణంగా, రోజువారీ యూపీఐ చెల్లింపులు, ఆన్‌లైన్ లావాదేవీలు, ముఖ్యమైన నెలవారీ బిల్లులు తదితర విధానాలకు ప్రతిఫలం ఇచ్చేందుకు ఈ కార్డ్ రూపొందించారు.. ఈ కార్డును ఇటీవల సిటీ యూనియన్ బ్యాంక్ ఎండీ డాక్టర్ ఎన్.కామకోడి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.విజయ్ ఆనంద్, శాలరీ సే సహ వ్యవస్థాపకులు మోహిత్ తదితరులు లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయ్ ఆనంద్ మాట్లాడుతూ. జీతం పొందే వారికి అర్హులైన ప్రయోజనాలను అందించం ద్వారా ఈ క్రెడిట్ కార్డ్ న్యాయాన్ని తెస్తుందన్నారు. యూపీఐలో క్రెడిట్ కార్డ్, రివార్డులు, లాంజ్ యాక్సెస్, తక్కువ ఫారెక్స మార్కప్, ఊహించదగిన ఆర్థిక సౌలభ్యం వంటి లగ్జరీ ప్రయోజనాలతో, ఈ ఉత్పత్తి లక్షలాదిమంది కోసం డబ్బు సులభతరం చేయడంతో పాటు వారి జీవన శైలిని మెరుగు పరుస్తుందని వివరించారు. యూపీఐలో క్రెడిట్‌తో, తాము ఆధునిక సురక్షితమైన, కస్టమర్-కేంద్రీకృత మోడల్ క్రెడిట్ విధానాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.



క్రెడిట్ కార్డ్ ఆవిష్కరణలో డాక్టర్ ఎన్.కామకోడి, ఆర్.విజయ్ ఆనంద్, మోహిత్ తదితరులు

మధ్యకైలాష్‌లో పాదచారుల వంతెన


వంతెన నమూనా

పెరంబూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక మధ్య కైలాష్ జంక్షన్‌లో, నాలుగు వైపులా వెళ్లేలా పాదచారుల వంతెన నిర్మించనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే వాహనాలు అడయార్ సర్దార్ పటేల్ రోడ్డులోని మధ్య కైలాష్ జంక్షన్ నుంచి పాత మహాబలిపురం రోడ్డుకు చేరుకోవాల్సి ఉంది. ఈ జంక్షన్‌లో అడయార్ సహా పలు ప్రాంతాలకు వెళ్లే వాహనాలు వస్తుండడంతో ట్రాఫిక్ రద్దీ కూడా ఉంటోంది. ఈ కారణంగా, ఈ జంక్షన్ వద్ద రూ.60 కోట్లతో 'ఎల్' ఆకారపు ఫ్లై ఓవర్ నిర్మాణాలు 2023లో ప్రారంభమయ్యాయి. పనులకు ఆటంకంగా ఉండడంతో ప్రస్తుతం ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి తొలగించారు. ఫ్లై ఓవర్ నిర్మాణాలు పూర్తయిన తర్వాత ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభం కానున్నాయి. ఈ విషయమై రహదారుల శాఖ అధికారులు మాట్లాడుతూ.. మధ్య కైలాష్ జంక్షన్, కస్తూర్బా నగర్ ఫ్లై ఓవర్ రైల్వేస్టేషన్, సర్దార్ పటేల్ రోడ్డు, ఓఎంఆర్, వినాయక ఆలయం వెనుక నాలుగు ప్రాంతాలు కలిపేలా పాదచారుల వంతెన నిర్మించనున్నామన్నారు. సర్దార్ పటేల్ రోడ్డు ఎక్కడానికి, దిగడానికి సహా మిగిలిన మూడు ప్రాంతాల్లో ఎక్కడానికి నడక మార్గాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఓఎంఆర్ మినహా మిగిలిన మూడు ప్రాంతాల్లో ఎస్కలేటర్ వసతి ఉంటుందన్నారు. ఆ పాదచారుల వంతెన పనులు ఫిబ్రవరిలో ప్రారంభం కానున్నాయని అధికారులు తెలిపారు.

70 ఏళ్లు నిండిన దంపతులకు నెల్లయప్పర్ ఆలయంలో సత్కారం

చెన్నై, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏడు పదుల వయస్సు కలిగిన వృద్ధ దంపతులను, వారికి సమీపంలో ఉన్న సుప్రసిద్ధ ఆలయాల్లో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సత్కరించాలని ముఖ్యమంత్రి స్టాలిన్ చేసిన ప్రకటన మేరకు నవంబర్ నుండి డెబ్బై యేళ్లు దాటిన వృద్ధ దంపతులను సత్కరిస్తున్నారు. ఈ నేపథ్యంలో తిరునల్వేలి నెల్లయప్పర్ ఆలయంలోని ఆరుముగనాయనార్ సన్నిధి ఎదుట డెబ్బై యేళ్లు నిండిన 50 మంది వృద్ధ దంపతులను దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ చెల్లయ్య, కార్యనిర్వహణాధికారి వెంకటేశ్వరన్ తదితర ప్రముఖులు కలిసి ఆ వృద్ధ దంపతులకు పూలమాలలు వేసి, నూతన వస్త్రాలు, సారె , పండ్లు పూలు, ప్రసాదం, తాంబూలాలు అందజేసి సత్కరించారు. అదే సమయంలో ఆలయానికి విచ్చేసిన భక్తులంతా ఆ వృద్ధ దంపతలకు నమస్కరించి ఆశీస్సులు పొందారు.


తిరునల్వేలి నెల్లయప్పర్ ఆలయంలో సత్కారం అందుకున్న వృద్ధ దంపతులు

● తిరుప్పరంకుండ్రం కేసు ...

సీఎస్, డీజీపీలకు హైకోర్టు మదురై బెంచ్ నోటీసు



ప్యారీస్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుప్పరంకుండ్రం కొండపై ఉన్న దీపస్తంభంలో దీపం వెలిగించాలనే ఉత్తర్వులను ఎందుకు అమలుచేయలేదో విచారణకు హాజరై కారణం చెప్పాలని తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీకి హైకోర్టు మదురై బెంచ్ నోటీసులిచ్చింది. కార్తిక మాసంలో నిర్వహించే మహాదీపోత్సవాన్ని పురస్కరించుకుని తిరుప్పరంకుండ్రం సుబ్రమణ్యస్వామి క్షేత్రంలోని కొండ శిఖరంపై ఉన్న దీపస్తంభలో మహాదీపం వెలిగించడంలో ప్రభుత్వం, హిందూ సంస్థల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. ఈ వ్యవహారంలో రెండు వర్గాలు కోర్టును ఆశ్రయించాయి. దీపం వెలిగించేందుకు అనుమతించాలని దాఖలైన కేసులో న్యాయమూర్తి స్వామినాథన్ పిటిషనర్‌కు అనుకూలంగా ఉత్తర్వులు జారీచేశారు. అయితే పోలీసులు ఈ ఉత్తర్వులను అనుమతించలేకపోవడంతో సంబంధిత హిందూ సంస్థలు మళ్లీ కోర్టులో పోలీసులకు వ్యతిరేకంగా కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశాయి. ఈ పిటిషన్ మంగళవారం మధ్యాహ్నం న్యాయమూర్తి స్వామినాథన్ ముందు విచారణకు వచ్చింది. హాజరైన ప్రభుత్వ న్యాయవాది దీపం వెలిగించేందుకు విధించిన గడువు పూర్తయినందున ఈ కేసుపై మళ్లీ విచారణ జరపాల్సిన అవసరం లేదని, దీపం వెలిగించాల్సిన వ్యక్తి కూడా కనిపించడం లేదన్నారు. ఈ కేసు విచారణను ఉద్దేశపూర్వకంగా సాగదీసేందుకు రాష్ట్రప్రభుత్వం కుట్రపన్నిందని పిటిషనర్ తరుపు న్యాయవాది ఆరోపించారు. ఇరు తరుపు వాదనలు విన్న న్యాయస్థానం ఉత్తర్వులను ఏ కారణం వల్ల నిర్లక్ష్యం చేశారో 17వ తేదీ జరగనున్న విచారణకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరై సమాధానం చెప్పాలని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, మదురై నగర పోలీసులు సంయుక్త కమిషనర్ తదితరులకు ఉత్తర్వులు జారీచేస్తూ తీర్పువాయిదా వేశారు.

ఘనంగా సోనియా జన్మదిన వేడుకలు

● రాష్ట్రవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు

ప్యారీస్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ)మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ 79వ జన్మదిన వేడుకలను మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. అన్ని జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ శ్రేణులు సంక్షేమ సహాయాలు పేదలకు పంపిణీ చేశారు. రాయపేటలోని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) ప్రధాన కార్యాలయమైన సత్యమూర్తి భవన్‌లో టీఎన్‌సీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే సెల్వ పెరుందగై ఆ పార్టీ సీనియర్ నేతలు కేవీ. తంగబాలు, కృష్ణస్వామి, తిరునావుక్కరసన్, పీటర్ అల్ఫోన్స్, ఎమ్మెల్యే రూబీ మనోహరన్, మహిళా కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి సోనియా బర్త్‌డే నిర్వహించారు. అదేవిధంగా అయినవరంలో ఏఐసీసీ సభ్యుడు, టీఎన్‌సీసీ ప్రధాన కార్యదర్శి కె.చిరంజీవి అధ్యక్షతన జరిగిన సోనియా గాంధీ జన్మదిన వేడుకల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేశారు. అనంతరం 500 మందికి అన్నదానం చేశారు. ఈ వేడుకల్లో అడ్వకేట్ కనకరాజ్, ప్రదీప్‌బాబు, ధరణికుమార్, సేతుపతి, భరత్‌కుమార్, సంజయ్ గాంధీ, శరవణన్, మనోజ్‌కుమార్, జీసీసీ కార్పొరేటర్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న ఏఐసీసీ సభ్యుడు చిరంజీవి

తిరువళ్లూరులో ట్రాఫిక్ రద్దీ

● నత్తనడకన బైపాస్ నిర్మాణ పనులు

తిరువళ్లూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేగంగా అభివృద్ధి చెందుతున్న తిరువళ్లూరు పట్టణంలో తరచూ ఏర్పడే ట్రాఫిక్ రద్దీ నివారించడానికి ప్రారంభించిన బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని వాహనదారులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా కేంద్రమైన తిరువళ్లూరు పట్టణంలో ట్రాఫిక్ నియంత్రించేందుకు సుమారు 9 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగానే మొదటి దశ పనుల నిమిత్తం ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం రూ.30కోట్లు విడుదల చేసింది. తిరుపాచ్చూర్ నుంచి సేలై వరకు చేపట్టిన ఈ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభమై సుమారు 25 సంవత్సరాలు దాటింది. జిల్లా కేంద్రానికి పరిసర ప్రాంతాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీంతో తిరువళ్లూరు సమీపంలోని తిరుమళిసై, శ్రీపెరంబదూరు, కాకలూరు, సిప్‌కాట్ వుండటంతో భారీ వాహనాలు సైతం సరుకులతో రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో నిత్యం ట్రాఫిక్ రద్దీ పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

నిత్యం రద్దీ... : తిరువళ్లూరు నుంచి ఆవడి, తిరుత్తణి, అర క్కోణం, తిరుపతి, శ్రీపెరంబదూరు, పూందమల్లి, చెన్నై తదితర ప్రాంతాలకు నిత్యం వెయ్యికి పైగా మట్టి ఇసుక లారీలు వెళ్తున్నాయని స్థానికులు వాపోయారు. దీంతో జేఎన్ రోడ్డు, సీవీ నాయుడు రోడ్డు, మార్కెట్ వీధి, ఆవడి-తిరువళ్లూరు, సెంగుండ్రం-తిరువళ్లూరు రోడ్డులో వాహనాలు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకోవాల్సి వస్తోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు గత 13 సంవత్సరాలుగా బైపాస్ రోడ్డు నిర్మాణం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇందులో భాగంగానే ఎగువనల్లాటూరు నుంచి తిరుప్పాచ్చూర్ వరకు సుమారు 9 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేయడానికి 2019లో ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. పనుల్లో చిన్న బ్రిడ్జీలు, రైల్వే బ్రిడ్జి, కూవం నదిపై వంతెన సహా 13 బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాల్సి వుంది. ఈ పనులకు మొత్తం రూ.86.26 కోట్లు కేటాయించగా, మొదటి దశ పనులను 5.6 కిలోమీటర్లకు రూ.30 కోట్లు 2020లో విడుదల చేశారు. అయితే పనులు 4 సంవత్సరాలుగా నత్తనడకన నడుస్తున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. పనులను వేగవంతం చేసి త్వరితగతిన బైపాస్ రోడ్డును అందుబాటులోకి తీసుకొని వచ్చి, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.


తిరువళ్లూరులోని జేఎన్‌రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

జనవరి 16న అంతర్జాతీయ పుస్తక ప్రదర్శన



పుస్తక ప్రదర్శన లోగో ఆవిష్కరిస్తున్న మంత్రి అన్బిల్ మహేష్

చెన్నై, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జనవరి 16న నగరంలో అంతర్జాతీయ పుస్తక ప్రదర్శన జరుగుతుందని పాఠశాలల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు. కోట్టూరుపురంలోని అన్నా శతజయంతి స్మారక గ్రంథాలయంలో మంగళవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో పుస్తక ప్రదర్శనకు సంబంధించిన లోగోను ఆయన ఆవిష్కరించారు. జనవరి 16 నుండి 18 వరకు చేపాక్ కలైవానర్ అరంగంలో ఈ పుస్తక ప్రదర్శన జరుగుతుందని ఆయన తెలిపారు. సుమారు వందకు పైగా విదేశీ పుస్తక ప్రచురణ సంస్థలు ఈ ప్రదర్శనలో పాల్గొంటాయని వందకు పైగా భాషాల్లో ముద్రించిన పుస్తకాలను ఈ ప్రదర్శనలో వీక్షించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి చంద్రమోహన్, గ్రంథాలయ సంస్థ సంచాలకులు ఎస్.జయంతి తదితరులు పాల్గొన్నారు.

'బ్రేక్స్ ఇండియా'- టీబీకే వ్యాపార ఒప్పందం


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న కౌరు ఒగాటా, శ్రీరాం

చెన్నై, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బ్రేక్స్ ఇండియా -టీబీకే కంపెనీ సంస్థలు ఇటీవల మూలధనం, వ్యాపార కూటమిపై ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ మేరకు ఇటీవల నగరంలో టీబీకే అధ్యక్షుడు, సీఈవో కౌరు ఒగాటా, బ్రేక్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీరాం విజి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. దీంతో టీఎస్ఎఫ్ గ్రూప్ కంపెనీ అయిన బ్రేక్స్ ఇండియా ప్రాథమిక మూలధనం ద్వారా టీబీకేలో 10 శాతం వాటా కొనుగోలు చేసినట్లయింది. ఈ సందర్భంగా కౌరు ఒగాటా, శ్రీరాం మాట్లాడుతూ.. ఈ భాగస్వామ్యం ద్వారా రెండు కంపెనీలు ఒకదానికొకటి సాంకేతిక బలాలు, కస్టమర్ స్థావరాలను పూర్తి స్థాయిలో వినియోగించుకుంటామన్నారు. ఇది వ్యూహాత్మక, దీర్ఘకాలిక వృద్ధికి తమ నిబద్ధతను బలోపేతం చేస్తుందని వివరించారు.

రూ.32.62కోట్లతో విక్టోరియా హాలు పునర్నిర్మాణం

● జీసీసీ మేయర్ ప్రియ


జీసీసీ అధికారులతో కలిసి పనులను పరిశీలిస్తున్న మేయర్ ప్రియ

ప్యారీస్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపంలోని చారిత్రాత్మక భవనం విక్టోరియా హాలును రూ.32.62కోట్లతో దాని ప్రాచీనతకు భంగం వాటిల్లకుండా పునర్నిర్మాణం చేపట్టినట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) మేయర్ ఆర్.ప్రియ పేర్కొన్నారు. బ్రిటీష్ పాలకులు ఇంగ్లాండ్ మహారాణి విక్టోరియా పేరుతో నగరం నడిఒడ్డున హాలు నిర్మించాలని నిర్ణయించగా, రాబర్ట్ సిసోల్మ్ అనే ఇంజనీర్ పర్యవేక్షణలో గోతిక్ విధానంలో నంబెరుమాళ్ చెట్టియార్ 1888వ సంవత్సరం అద్భుత శిల్పకళా సౌందర్యంతో విక్టోరియా హాలు నిర్మించారు. నగరానికి పలు ప్రాంతాలనుంచి వచ్చే పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్న ఈ హెరిటేజ్ కట్టడాన్ని దాని ప్రాచీనత దెబ్బతినకుండా పునర్నిర్మించాలని ఆదేశించిన ముఖ్యమంత్రి స్టాలిన్ అందుకు నిధులు కూడా కేటాయించారు. సింగార చెన్నై 2.0 పథకం కింద పునర్నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. విక్టోరియా పబ్లిక్ హాలు పునర్నిర్మాణ పనులను మంగళవారం మేయర్ ప్రియ పరిశీలించారు. ఆమెతో పాటు జీసీసీ కమిషనర్ కుమరగురుబరన్, ఇంజనీర్లు, అధికారులు, స్టాండింగ్ కమిటీ చైర్మన్లు ఉన్నారు.

ఒరగడంలో సుగామీ ప్లాంట్ ప్రారంభం


ప్లాంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సంస్థ నిర్వాహకులు

చెన్నై, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ యంత్ర పరికరాల తయారీలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన జపాన్‌కు చెందిన సుగామీ సంస్థ శ్రీపెరుంబుదూరు సమీపంలోని ఒరగడం వద్ద కొత్త ఇంజనీరింగ్ అసెంబ్లీ ప్లాంట్, ఫౌండ్రీని ప్రారంభించింది. ఈ కర్మాగారం ప్రారంభోత్సవంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి అరుణ్‌రాయ్, జెట్రో డైరెక్టర్ జనరల్ కౌరు శిరైషి, సుగామి ఇండియా బోర్డు చైర్మన్ తోషిహిరో సెరికావా, డైరెక్టర్లు మామ మటుషితా, వీర సురేష్ కుమార్ ప్రోటెక్ మెషినరీ ఇండియా చైర్మన్ కే బాలసుబ్రమణియన్ తదితరులు పాల్గొన్నారు. ఈ కర్మాగారం ద్వారా సుమారు 1000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాల లభించినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు.

20.30 గంటలు.. 203 కిలోమీటర్లు



వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు ధ్రువపత్రం

స్కేటింగ్‌లో అంధ విద్యార్థి రికార్డు

తిరుపతి(క్రీడలు)/వడమాలపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కంటి చూపులేదు. కానీ స్కేటింగ్‌లో అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడు. 20.30 గంటల్లో 203 కిలోమీటర్లు స్కేటింగ్ చేశాడు. సోమవారం ఉదయం చిత్తూరుజిల్లా నంగిలిలో మొదలైన స్కేటింగ్ యాత్ర.. గంటకు దాదాపు 15 కిలోమీటర్ల వేగంతో సాగింది. మధ్యలో మూడుసార్లు బ్రేక్ తీసుకున్నాడు. ఇలా మంగళవారం వేకువజామున 2.30 గంటలకు వడమాలపేట మండలంలోని ఎస్వీపురం టోల్‌ప్లాజా గమ్యస్థానానికి హర్షవర్ధన్ చేరుకున్నాడు. మంగళవారం తిరుపతిలోని శ్రీనివాస క్రీడా సముదాయంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. హర్షవర్ధన్ యాత్రను ప్రత్యక్షంగా రికార్డుచేసిన న్యాయనిర్ణేతలు ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు ఏపీ చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ టి.రామకృష్ణారెడ్డి, జీనియస్ బుక్ ఆఫ్‌రికార్డ్ నుంచి శ్రీనివాసరావు, విశ్వచంద్రారెడ్డి, వజ్రవరల్డ్ రికార్డ్ నుంచి పి.హరిణి ద్వారా ఆ బాలుడికి పతకాలు, ధ్రువపత్రాలు అందజేశారు. పలువురు దాతలు ఆర్థిక సాయం అందించారు. మరిన్ని రికార్డులు సాధించాలని ఆకాంక్షించారు. కాపుకార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసుదేవ, తిరుపతి, చిత్తూరు డీఎస్‌డీవోలు శశిధర్, ఉదయ్‌భాస్కర్, స్కేటింగ్ కోచ్‌లు ప్రతాప్, ప్రేమ్‌నాథ్, శాప్ కోచ్‌లు లక్ష్మీకరుణ, చక్రవర్తి, హిందూజ, వినోద్, నాగరాజు, గోపీ, సాయిసుమతి తదితరులు పాల్గొన్నారు.


పతకాలు, ధ్రువపత్రాలు అందుకుంటున్న హర్షవర్ధన్

తిరుపతి- షిర్డీ వీక్లీ రైలు ప్రారంభం



తిరుపతి (సెంట్రల్), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి, సాయినగర్ షిర్డీ.. ఆధ్యాత్మిక క్షేత్రాల మధ్య అనుసంధానం పెరిగేలా, భక్తుల సౌకర్యార్థం వీక్లీ రైలును ప్రారంభించారు. ఢిల్లీ నుంచి మంగళవారం కేంద్ర రైల్వే సహాయ మంత్రి వి.సోమన్న వర్చువల్‌గా ప్రారంభించగా, తిరుపతి ఎంపీ గురుమూర్తి పాల్గొన్నారు. అదే సమయంలో తిరుపతిలో రాష్ట్ర మంత్రి బీసీ జనార్దనరెడ్డి, రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీటీడీ సభ్యుడు జి.భానుప్రకాష్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ, తుడా మాజీ ఛైర్మన్ జి.నరసింహయాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు, రైల్వే సీతఃః సూర్యనారాయణ, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, డిప్యూటీ సీతఃః వామనమూర్తి, సీపీఆర్‌వో ఎ.శ్రీధర్, ఎస్ఎంఆర్ డాక్టర్ కె.చిన్నప రెడ్డి, ఐపీఎఫ్ సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రానికి ఎన్నో రైల్వే ప్రాజెక్టులు మంజూరు చేస్తున్నామని, ప్రధానంగా విజయవాడ- గూడూరు మధ్య మూడో రైలు మార్గం పనులు జరుగుతున్నాయని కేంద్ర మంత్రి సోమన్న వెల్లడించారు. తిరుపతి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు రూ.312 కోట్లతో జరుగుతున్నాయని రాష్ట్ర మంత్రి జనార్దన్‌రెడ్డి తెలిపారు. తిరుపతి-పాకాల-కాట్పాడి డబ్లింగ్, గూడూరు-రేణిగుంట మూడవ లైను, నడికుడి - శ్రీకాళహస్తి రైలు మార్గాల పనులు జరుగుతున్నాయని వివరించారు.

విద్యార్థినిపై ఆటో డ్రైవర్ అత్యాచారం

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో 16 ఏళ్ల విద్యార్థినిపై ర్యాపిడో ఆటో డ్రైవరు అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుతో ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అలిపిరి సీఐ రాంకిషోర్ తెలిపిన ప్రకారం.. అనంతపురానికి చెందిన ఆ విద్యార్థిని తిరుపతి నగరం భవానీనగర్‌లోని ఓ ప్రైవేటు హాస్టల్లో ఉంటూ చదువుకుంటోంది. ఇటీవల ఆమె హాస్టల్ మారారు. పుస్తకాలు, చిన్న చిన్న పాత్రలు తీసుకెళ్లేందుకు ర్యాపిడో ఆటో బుక్ చేసుకుంది. ఆన్‌లైన్‌లో ఆమె మొబైల్ నెంబరు కర్నూలుకు చెందిన ఆటో డ్రైవర్ సాయికుమార్ (ప్రస్తుతం తిరుపతిలో) వద్ద సేవ్ అయింది. దీంతో అతడు ఆమెకు పలుమార్లు ఫోను చేశాడు. కొంత కాలంగా వీరి మధ్య పరిచయం పెరగింది. తనకు అత్యవసరమై ఆమె ఆటో డ్రైవర్‌ను డబ్బు అడిగింది. దీనిని అవకాశంగా తీసుకున్న ఆటో డ్రైవర్.. ఆమెను మభ్యపెట్టి తన గదికి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ నెల 2న సాయంత్రం ఫోన్ చేసి భవానీనగర్ సర్కిల్‌కు రమ్మని చెప్పాడు. ఆమెను ఆటోలో శివారు ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని అతడు బెదిరించడంతో ఆమె భయపడి ఎవరికీ చెప్పలేదని పోలీసులు అంటున్నారు. చివరకు ఈ ఘటనపై తన స్నేహితురాలితో కలసి సోమవారం రాత్రి బాధితురాలు అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోక్సో చట్టం కింద నిందితుడు సాయికుమార్‌పై అలిపిరి సీఐ రాంకిషోర్ కేసు నమోదు చేశారు. అతడి ఆటో నెంబరు కోసం ఆమెకు సంబంధించి పాత, కొత్త హాస్టళ్ల వద్ద సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. నిందితుడిని పట్టుకునేందుకు ఎస్పీ సుబ్బరాయుడు మూడు ప్రత్యేక పోలీసు బృందాలను నియమించారు. ఆ రోజు నుంచి నిందితుడు మొబైల్ ఫోన్ ఆఫ్ చేయడంతో ఆచూకీ గుర్తించడం కొంత కష్టంగా మారింది. వీలైనంత త్వరలో అతడిని పట్టుకుంటామని సీఐ రాంకిషోర్ చెప్పారు.

ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్ల అరెస్టు

- సంస్కృత వర్సిటీలో విద్యార్థినిపై లైంగిక వేధింపుల కేసులో పురోగతి
- ఒడిశాలో బాధితురాలి వాంగ్మూలం నమోదు



లక్ష్మణ కుమార్ - ఎ.శేఖర్‌రెడ్డి

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో విద్యార్థినిపై లైంగిక వేధింపుల కేసులో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ లక్ష్మణకుమార్, డాక్టర్ శేఖర్‌రెడ్డిని మంగళవారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి వాగ్మూలం నమోదు చేశారు. తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం తెలిపిన ప్రకారం.. ఒడిశాకు చెందిన విద్యార్థినిపై అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మణ కుమార్ ఇటీవల తన ఆఫీసు గదిలో లైంగిక దాడికి పాల్పడ్డాడు. అదే విభాగంలోని మరో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ.శేఖర్‌రెడ్డి సంఘటనకు సంబంధించి ఫొటోలు, వీడియో తీసి ఆ విద్యార్థినిని బ్లాక్ మెయిల్ చేశాడు. దీనిపై వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రజనీకాంత్ శుక్లా తిరుపతి వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ మురళీమోహన్ కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తు అధికారిగా డీఎస్పీ భక్తవత్సలంను ఎస్పీ సుబ్బరాయుడు నియమించారు. ఇక, వెస్ట్ సీఐ మురళీమోహన్, అలిపిరి ఎస్ఐ అజిత, మరో నలుగురు మహిళా కానిస్టేబుళ్ల బృందం రెండు రోజుల కిందట ఒడిశా వెళ్లి.. బాధితురాలి వాగ్మూలం రికార్డు చేశారు. మరోవైపు ఘటనా స్థలం పరిశీలన, సేకరించిన ఆధారాలు, సాక్షుల వాగ్మూలం ఆధారంగా కేసులో అదనంగా బీఎన్ఎస్ సెక్షన్లు 63,68 కింద చేర్చారు.

స్క్రబ్‌టైఫస్ జ్వరాలపై ఆందోళన వద్దు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ జ్వరాలపై ఆందోళన వద్దని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. వ్యాధి నివారణ, చికిత్సపై ఆరోగ్యశాఖ అధికారులతో మంగళవారం వర్చువల్ విధానంలో సమీక్షించారు. స్క్రబ్ టైఫస్ చిగ్గర్‌మైట్ అనే పురుగు ద్వారా వస్తుందని తెలిపారు. ఇది పొలాలు, గడ్డి ప్రాంతాలు, పశువుల పాక వంటి చోట్ల ఎక్కువగా వ్యాపిస్తుందన్నారు. కాటు వేసిన చోట నల్లమచ్చ ఉంటుందని, ఐదు రోజులకు మించి జ్వరం తలనొప్పి, ఒళ్లు నొప్పులుంటే చికిత్సలు పొందాలన్నారు. జిల్లాలో అనుమానిత కేసులు నమోదైన వెంటనే రాపిడ్ రెస్పాన్స్ టీం స్పందించి అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో రాపిడ్‌టెస్టులు నిర్వహించి రక్త నమూనాలను సేకరించి నిర్ధారణ కోసం రుయా, స్విమ్స్‌కు పంపించాలని ఆదేశించారు. జిల్లాలో స్క్రబ్ టైఫస్‌వ్యాధి వ్యాప్తి నివారణకు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఆనంద్, ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్ రాధ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిని కాపాడబోయి..

- నీట మునిగి ఆమెతో పాటూ ప్రాణాలు కోల్పోయాడు



మృతి చెందిన గుణశేఖర్ - అంకమ్మ

నారాయణవనం, డిసెంబర్ 9(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిని కాపాడబోయి.. చివరకు ఆమెతో పాటు ఆ వ్యక్తి కూడా ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాద ఘటన మంగళవారం నారాయణవనం మండలంలోని తిరువట్యం వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నగరి మండలం గుండ్రాజుకుప్పానికి చెందిన గుణశేఖర్(42) తిరువట్యంలో తన బంధువు దహనక్రియలకు వచ్చారు. సాయంత్రం ఈయన ఇంటికి వెళ్తుండగా.. అదే సమయంలో తిరువట్యం కాజ్‌వే వద్ద నారాయణవనం రజక కాలనీకి చెందిన అంకమ్మ(72) దుస్తులు ఉతుకుతూ నీటిలో పడిపోయింది. దీనిని గమనించిన గుణశేఖర్ ఆమెను కాపాడేందుకు నదిలో దూకడంతో, ఊపిరాడక చనిపోయాడు. వృద్ధురాలూ మృతి చెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఆస్పత్రికి వెళ్తుండగా ప్రమాదం

- బైక్‌ను ఢీకొన్న ఆటో
- భార్య మృతి, భర్తకు తీవ్ర గాయాలు


లావణ్య (ఫైల్‌ఫొటో)

కోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉదయాన్నే వెళ్తే డాక్టర్ దగ్గర ముందుగానే చూపించుకుని తిరిగొచ్చేయచ్చని, తరువాత పనులకు వెళ్లొచ్చని బయలుదేరిన దంపతులు ప్రమాదానికి గురయ్యారు. భార్య అక్కడికక్కడే మృతి చెందగా, భర్త తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. ఈ ఘటన కోట మండలం చిట్టేడు, కేశవరం గ్రామాల సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. కోట మండలం గూడలి అరుంధతీయవాడకు చెందిన ధనరాశి మల్లికార్జున్, లావణ్య దంపతులకు వివాహమై 13 సంవత్సరాలు అవుతోంది. వీరికి పిల్లలు లేకపోవడంతో గూడూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయాన్నే డాక్టర్ దగ్గరకు వెళ్దామని మల్లికార్జున్, లావణ్య దంపతులు బైక్‌పై గూడూరుకు బయలుదేరారు. చిట్టేడు - కేశవరం గ్రామాల నడుమ వెళ్తుండగా గూడూరు నుంచి వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో లావణ్య(28) అక్కడికక్కడే మృతి చెందింది. మల్లికార్జున్ నడుం, భుజం, తలకు బలమైన గాయాలయ్యాయి. ఆటో నడుపుతున్న గూడూరుకు చెందిన అబ్బాస్ స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న గూడూరు డీఎస్పీ గీతాకుమారి, వాకాడు సీఐ హుస్సేన్‌బాషా, కోట ఎస్ఐ పవన్‌కుమార్ సంఘటనాస్థలికి చేరుకున్నారు. రోడ్డుపై ఉన్న లావణ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మల్లికార్జున్‌ను నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా, ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.


తీవ్రంగా గాయపడిన మల్లికార్జున్

ముంపు బాధితులను ఆదుకుంటాం: కలెక్టర్

కేవీబీపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం కళత్తూరు చెరువు ముంపు బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. కళత్తూరులో ముంపు బాధితులకు రూ.1.21 కోట్లు, రూ.42,20,000 కు సంబంధించి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా బాధితులకు మైక్ అందించి ప్రభుత్వం నుంచి ఏం కోరుకుంటున్నారో చెప్పాలన్నారు. తమకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని, దెబ్బతిన్న మురుగు వ్యవస్థను బాగు చేయించాలని, సిమెంటు రోడ్డు నిర్మించాలని, సిలిండర్లను పంపిణీ చేయాలని కోరారు. అన్నిటికంటే ముందు రాయలచెరువు కట్ట పటిష్ఠం చేయాలని, పాఠశాల భవనాలను బాగు చేయించాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. 625 పశువులు మృతి చెందగా గేదెకు రూ.50వేలు, ఆవుకు రూ.40వేలు, గొర్రెలు, మేకలకు రూ.7,500, కోళ్లకు రూ.100 చొప్పున పరిహారం అందిస్తున్నామన్నారు. ప్రతి కుటుంబానికి రూ.10వేలు చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని బాధితుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. ఇప్పటికే రూ.4 కోట్లకుపైగా ప్రభుత్వం ఖర్చు చేసిందని వివరించారు. రుణాల విషయంలో బ్యాంకర్లతో మాట్లాడి మహిళలకు ప్రత్యేక సహాయనిధిని ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. పొలాల్లో ఇసుక, మట్టి మేటలుంటే హెక్టారుకు రూ.18వేలు, కోతకు గురైతే ఎకరాకు రూ.18వేలను త్వరలో రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డులు పోగొట్టుకున్నవారికి ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి అందిస్తామన్నారు. విద్యార్థులు తాము చదువుకున్న విద్యా సంస్థల వివరాలను కార్యాలయంలో అందజేయాలని సూచించారు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులునాయుడు, తిరుపతి పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షుడు గోపీనాథ రెడ్డి, గోవర్ధన్, సాదు, థామస్, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీ, తహసీల్దారు రోశయ్య, ఎంపీడీవో మాలతి, ఏవో సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పశువులు, గొర్రెలు, మేకలు కోల్పోయిన వారికి చెక్కు అందజేస్తున్న కలెక్టర్

ప్రజల ఆకాంక్షను గుర్తించండి


టవర్‌క్లాక్ వద్ద దీక్షలో జేఏసీ నాయకులు

గూడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గూడూరు ప్రజల ఆకాంక్షను గుర్తించి నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని జేఏసీ కన్వీనర్ దశరథరామిరెడ్డి అన్నారు. పట్టణంలో టవర్‌క్లాక్ సెంటర్ వద్ద చేపట్టిన రిలే దీక్ష మంగళవారం నాటికి మూడో రోజుకు చేరింది. ప్రైవేటు పాఠశాలలకు చెందిన బస్సు డ్రైవర్లు, ఆటో కార్మికులు, బీజేపీ నాయకులు దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలపడం వల్ల జిల్లా కేంద్రంలోని కార్యాలయాలకు వెళ్లాలంటే ప్రజలు, ఉద్యోగులు వ్యయప్రయాసలకు గురవుతున్నారని చెప్పారు. గూడూరుకు దగ్గరగా ఉండే నెల్లూరే సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. ఇదే డిమాండ్‌తో జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు, వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

- నలుగురి అరెస్టు


నిందితులను మీడియా ముందు చూపుతున్న సీఐ మురళి

వరదయ్యపాళెం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలం లక్ష్మీపురంలో ఇటీవల జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ వివరాలను మంగళవారం ఉదయం మీడియాకు సీఐ మురళి వెల్లడించారు. ఆ ప్రకారం.. సీఎల్ఎన్ పల్లె మిట్ట హరిజనవాడలో గతనెల 30న గ్రామానికి చెందిన వంటమాస్టర్ హరి(33)ని దుండగులు హత్య చేసి పాడుబడిన ఇంట్లో పడేసి వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న ఎస్ఐ మల్లికార్జున్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. చెన్నై నుంచి అన్నదమ్ములు గౌతమ్, ప్రేమ్‌కుమార్ గ్రామంలో వచ్చి నివాసం ఉంటున్నారు. వారితో హరితో స్నేహంగా ఉండేవారు. గౌతమ్ స్థానికంగా ఏసీ పరిశ్రమలో పని చేస్తుండగా, ప్రేమ్‌కుమార్ జులాయిగా తిరిగేవాడు. ముగ్గురూ కలిసి మద్యం తాగేవారు. ఈ క్రమంలో మద్యం మత్తులో జరిగిన గొడవలో గౌతమ్, ప్రేమ్‌కుమార్ కలిసి హరిపై దాడి చేశారు. గమనించిన హరి బంధువులు, గ్రామస్తులు గౌతమ్, ప్రేమ్‌కుమార్‌ను హెచ్చరించారు. ఎక్కడినుంచో వచ్చి తమ గ్రామానికి చెందిన వ్యక్తిని ఎలా కొడతారంటూ తిట్టి పంపించారు. మీరేం చేయలేరంటూ హరి వారికి సవాల్ విసిరాడు. దీంతో అహం దెబ్బతిన్న గౌతమ్, ప్రేమ్‌కుమార్.. హరిని కడతేర్చాలని పథకం పన్నారు. కొద్ది రోజుల తరువాత హరితో ఎప్పటి లాగే సఖ్యంగా మెలిగారు. రోజూ హరికి మద్యం తాగించేవారు. గత నెల 30వ తేదీ హరి భార్య దేవసేన ఊరికి వెళ్లడంతో ఇదే సరైన సమయమని భావించిన గౌతమ్, ప్రేమ్‌కుమార్.. హరిని తమ ఇంటికి తీసుకెళ్లి ఫుల్‌గా మద్యం తాగించారు. అప్పటికే తమ ఇంట్లో హత్య కోసం చెన్నై నుంచి పిలిపించుకున్న మరో ఇద్దరు స్నేహితుల సహకారంతో గౌతమ్, ప్రేమ్‌కుమార్‌లు హరిని ఐరన్‌రాడ్, బండరాయితో హత్య చేశారు. హరి మృతి చెందాడని నిర్ధారించుకున్న తరువాత హత్యకు ఉపయోగించిన బండరాయిని, మృతుడిపై ఉన్న మరకలను శుభ్రంగా కడిగి, సమీపంలోని పాడుబడిన ఇంట్లో మృతదేహాన్ని పడేసి వెళ్లిపోయారు. హత్యకు ఉపయోగించిన ఐరన్ రాడ్‌ను, తాము ధరించిన దుస్తులను కాల్చి ఉబ్బలమడుగు సమీపంలోని నీటి కాలువలో కలిపేశారు. మృతుడి భార్య దేవసేన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఉబ్బలమడుగు క్రాస్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని అదుపులో తీసుకుని విచారణ చేయడంతో హత్యను చేసినట్లు నేరం ఒప్పుకున్నారు. గౌతమ్, ప్రేమ్‌కుమార్‌తో పాటు చెన్నై థౌజండ్‌లైట్స్‌కి చెందిన జాన్‌పాల్ అలియాస్ జాన్, ఊటీకి చెందిన బెంజమిన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. వీరి నుంచి హత్యకు ఉపయోగించిన ఐరన్ రాడ్, బండరాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్ఐ మల్లికార్జున్, సత్యవేడు రెండో ఎస్ఐ లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు స్థిరమైన ఉపాధి

- మంత్రి లోకేశ్ నిరంతర కృషి
- అమెరికా పర్యటన సత్ఫలితాలిస్తోందన్న భానుప్రకాష్


మంత్రి లోకేశ్‌తో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

నగరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, యువతకు స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ అమెరికా పర్యటన సత్ఫలితాలనిస్తోందన్నారు. మంత్రితో పాటు ఎమ్మెల్యే భాను కూడా ఉన్నారు. ఏపీని పెట్టుబడులకు ఉత్తమ గమ్యస్థానంగా పరిచయం చేస్తూ లోకేశ్ ప్రముఖ సంస్థలతో పలు కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. సెమీకండక్టర్, కృత్రిమ మేధస్సు, క్వాంటం కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆయా ప్రముఖ సంస్థలను లోకేశ్ ఆహ్వానించినట్లు వివరించారు. రాష్ట్ర ఆర్థిక బలోపేతం, పరిశ్రమల విస్తరణ, ఉపాధి అవకాశాల పెంపు వంటి అంశాలే అమెరికా పర్యటన ప్రధాన ఉద్దేశమన్నారు.

- పొగాకు పొడి చల్లి నగ లాక్కెళ్లిన

ఆటో డ్రైవర్ సహా ముగ్గురి అరెస్టు

- బంగారు గొలుసు, కత్తులు, ఆటో స్వాధీనం



నిందితుల అరెస్టును చూపుతున్న తిరుపతి రూరల్ పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలో ఆదివారం సాయంత్రం పొగాకు పొడి చల్లి, కొట్టి మహిళ మెడలో బంగారు నగ లాక్కెళ్లిన ఘటనలో ముగ్గురు నిందితులను పోలీసులు పట్టుకున్నారు. ఈ వివరాలను మంగళవారం తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు మీడియాకు వెల్లడించారు. ఆ ప్రకారం.. రైల్వే కోడూరులోని శ్రీరామ్ నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ కస్తూరి జయకృష్ణ, అదే ప్రాంతానికి చెందిన మాచినేని శిరీష, అన్నమయ్య జిల్లా రాజంపేట తాలూకా కొట్టపల్లికి చెందిన లింగుట్ల వెన్నెల మిత్రులు. వీరు చిన్నప్పటి నుంచి జులాయిగా తిరిగేవారు. చిన్న దొంగతనాలకు పాల్పడేవారు. ఈ క్రమంలో తిరుపతి వ్యవసాయ కళాశాలలో అటెండరుగా పనిచేస్తున్న మల్లిక డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్లడానికి రోడ్డుపై నిలబడి ఉన్నారు. ఇంతలో పెరుమాళ్లపల్లి వైపు వెళుతున్న ఆటో వచ్చింది. ఆటోలో అప్పటికే ఇద్దరు మహిళలు ఉండటంతో ఆమె ధైర్యంగా ఎక్కారు. పథకం ప్రకారం ఆ ఇద్దరు మహిళలు ఆటో డ్రైవర్ సహాయంతో మల్లిక కళ్లలో పొగాకు పొడి చల్లి తలపై రాడ్డుతో కొట్టారు. ఆమె మెడలో వున్న బంగారు చైను లాక్కొని ఆటో నుంచి కిందకు తోసేసి పరారయ్యారు. దాడిలో బాధితురాలికి తలపై బలమైన గాయం కావడం, శరీరమంతా చిన్నపాటి దెబ్బలు తగలడంతో స్థానికులు రుయాలో చేర్పించారు. ఈ ఘటన జరిగిన వెంటనే ఎస్పీ సుబ్బరాయుడు స్పందించి చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. నిందితులు వాడుతున్న మొబైల్ ఫోన్ల ఆధారంగా వాళ్లున్న ప్రాంతాన్ని గుర్తించారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా చెర్లోపల్లి జంక్షన్ వద్ద అయాన్ డిజిటల్ సమీపంలో నిందితులను పట్టుకుని అరెస్టు చేశారు. వారి నుంచి 24 గ్రాముల బంగారు చైను, దోపిడీకి ఉపయోగించిన కత్తులు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును చాలెంజ్‌గా తీసుకుని అత్యంత వేగంగా ఛేధించిన పోలీసు బృందాలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

తిరుమలలో దుకాణాల పరిశీలన

తిరుమల, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు సభ్యురాలు అనుగోలు రంగశ్రీ మంగళవారం తిరుమలలోని దుకాణాలను పరిశీలించారు. ఎస్టేట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సిబ్బందితో కలిసి ఆమె తిరుమలలోని షాపింగ్ కాంప్లెక్స్‌కు వెళ్లారు. అక్కడి దుకాణాల లైసెన్సులను స్వయంగా పరిశీలించారు. అనధికారికంగా ఎవరైనా దుకాణాలు నిర్వహిస్తున్నారా అని తనిఖీ చేశారు. అలాగే హాకర్ లైసెన్సులను కూడా చూశారు. టీటీడీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పలువురు దుకాణదారులకు సూచనలు చేశారు.


లైసెన్సులు పరిశీలిస్తున్న రంగశ్రీ

డివైడర్ ఢీకొన్న ఆటో

- తండ్రీ కొడుకులకు తీవ్ర గాయాలు



గాయపడ్డ మహమ్మద్ అలీ, రహమాన్

శ్రీకాళహస్తి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి డివైడర్ను ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న తండ్రీ కొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. శ్రీకాళహస్తి మండలం చెర్లోపల్లి వద్ద మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. తిరుపతికి చెందిన మహమ్మద్ అలీ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శ్రీకాళహస్తిలో ఏడుగంగల జాతర కోసం తిరుపతి నుంచి పూలమాలలను తీసుకుని ఆటోలో కొడుకు అబ్దుల్ రహమాన్‌తో పాటు బయలుదేరారు. నాయుడుపేట- రేణిగుంట జాతీయ రహదారిపై శ్రీకాళహస్తి పట్టణంలోకి వెళ్లేందుకు సర్వీస్ రోడ్డు ఆరంభమయ్యే చోట ఆటో అదుపుతప్పి డివైడర్ను ఢీకొంది. ఈ ఘటనలో వీరిద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం క్షతగాత్రులను తిరుపతి ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.